# ఆపరేషన్ ప్రహార్: ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్

ఖమ్మం, ఫిబ్రవరి 22: ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులకు పెద్ద ఎదురు దెబ్బ తగిలింది. సుక్మా జిల్లాలో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో 8 మంది మావోయిస్టులు మృతిచెందారు. తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ ప్రహార్ చేపట్టారు. ఆపరేషన్‌లో సుమారు 1500 మంది డీఆర్జీ బలగాలు, 500 మంది కోబ్రా బెటాలియన్ జవాన్లు పాల్గొన్నారు. బడేకదేవాల్ అటవీ ప్రాంతంలో 30 గంటల పాటు ఆపరేషన్ ప్రహార్ కొనసాగింది. కసాల్పవాడ్ అటవీ ప్రాంతంలో భీకరమైన ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఘటనాస్థలంలో మావోయిస్టులకు చెందిన భారీ సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఆపరేషన్ ప్రహార్‌లో భాగంగా భద్రతా బలగాలు బృందాలుగా దండకారణ్యంలో సుమారు 30 కిలోమీటర్ల వరకు చొచ్చుకుపోయి సెర్చ్‌ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిసింది.


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 23-2-2020 RNI No.52865/93·Postal No\.H/SD/258/2018-20 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :26 సంచిక: 179 పేజీలు: 4 వెల: రూ.1/-


# భారతదేశానికి న్యాయవ్యవస్తే సుప్రీం

## న్యాయస్థానాల తీర్పులతో ప్రజల్లో విశేష స్పందన
## సంక్లిష్ట పరిస్థితుల పరిష్కారానికి న్యాయవ్యవస్థ కృషి
## అంతర్జాతీయ న్యాయ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): భారతదేశానికి న్యాయ వ్యవస్థనే సుప్రీం అని ప్రధాని నరేంద్రమోడీ స్పష్టం చేశారు. చట్టమనేది రాజులకే రారాజు.. చట్టమే అత్యున్నతమైనది అని ప్రధాని మోదీ తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలోని సుప్రీంకోర్టు ప్రాంగణంలో అంతర్జాతీయ న్యాయ సదస్సును ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వచ్చిన న్యాయనిపుణులకు ధన్యవాదాలు తెలిపారు. ఇటీవల అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులకు ప్రజల నుంచి విశేష స్పందన వచ్చిందన్నారు. భారత అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పులను 130 కోట్ల మంది భారతీయులు అంగీకరించారని మోదీ తెలిపారు. ఈ సందర్భంగా తలాక్, మహిళలకు 26 వారాల ప్రసూతి సెలవులు,దివ్యాంగ హక్కులపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను అందరూ ప్రశంసించారన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణకు న్యాయ వ్యవస్థ సముచిత న్యాయం కల్పించిదని కొనియాడారు. ప్రస్తుతం డేటా భద్రత, సైబర్ క్రైమ్ వంటి నేరాలు పెరిగిపోతూ న్యాయవ్యవస్థకు సవాలుగా నిలిచిందని పేర్కొన్నారు. వీటిని పరిష్కరించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. మహాత్మాగాంధీ న్యాయవాది.. గాంధీ ఆచరించిన మార్గంతో న్యాయవ్యవస్థకు పునాది వేశారు. మహాత్మాగాంధీ తన జీవితాన్ని సత్యం, సేవా మార్గంలో కొనసాగించారు. గాంధీజీ తన ఆత్మకథలో, తన జీవితంలో పోరాడిన మొదటి దావా గురించి రాశారు అని మోదీ గుర్తు చేశారు. ప్రపంచం అనేక సమస్యలు ఎదుర్కొంటోంది అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో సంక్లిష్ట పరిస్థితుల పరిష్కారానికి న్యాయవ్యవస్థ కృషి చేస్తోందని, నిరంతరం అధ్యయనంతోనే కొత్త విషయాలు తెలుసుకోవచ్చన్నారు. వ్యవస్థలో మార్పులు హేతుబద్ధంగా, చట్ట ప్రకారం ఉండాలి. భారతదేశ శాసన, న్యాయశాఖలు పరస్పరం గౌరవించుకుంటాయి. 70 ఏళ్ల భారత రాజకీయ వ్యవస్థలో మహిళలకు సముచిత ప్రాధాన్యం కల్పించామని తెలిపారు. మహిళలకు ఓటు హక్కు కల్పించిన ప్రముఖ దేశాల్లో భారత్ ఒకటి అని మోదీ పేర్కొన్నారు. 135 కోట్ల మంది భారతీయులు తమ సమస్యలను న్యాయవ్యవస్థ ద్వారానే పరిష్కరించుకుంటున్నారు. లింగ సమానత్వం లేనిదే సంపూర్ణ వికాసం ఉండదని ప్రధాని మోడీ అన్నారు. బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం కేవలం లాయర్ల డాక్యుమెంట్ మాత్రమే కాదు.. అది అందరి జీవితాలకు మార్గదర్శకం అని అన్నారు. దేశంలో పర్యావరణ పరిరక్షణకు సుప్రీం తన తీర్పులతో ఎంతో సహకరించిందన్నారు. మారుతున్న సాంకేతికతను న్యాయవ్యవస్థ అందిపుచ్చుకోవాలి అని మోదీ సూచించారు.

### అనేక సంస్కృతుల సమాహారం: చీఫ్ జస్టిస్

సదస్సులో చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే మాట్లాడుతూ అనేక సంస్కృతులు, సాంప్రదాయాలకు భారత్ నిలయం అన్నారు. ఆ కోవలోనే భారతీయ న్యాయవ్యవస్థ కూడా రూపాంతరం చెందినట్లు చెప్పారు. మన దేశానికి వచ్చిన ప్రతి నాగరిక సమాజానికి చెందిన న్యాయ సాంప్రదాయాలను స్వాగతించామని సీజే బోబ్డే తెలిపారు. సుప్రీం తీసుకునే నిర్ణయాలు ప్రతి ఒకరి జీవితాలను ప్రభావితం చేస్తుందన్నారు. రాజ్యాంగంలోని ప్రాథమిక విధులను మనం నిర్లక్ష్యం చేస్తున్నామని ఆయన అన్నారు. మన విధులను మనం సక్రమంగా నిర్వర్తిస్తే, అప్పుడు అన్ని హక్కులను అమలు చేయడం సులువు అవుతుందన్న మహాత్మాగాంధీ బోధనలను బోబ్డే గుర్తు చేశారు. సవాళ్లను న్యాయవ్యవస్థ ఎంత సమర్థంగా ఎదుర్కొంటతే.. ఆ చట్టాల అమలులో విజయం అంతగా ఉంటుందని సీజే అన్నారు. ఈ సందర్భంగా జస్టిస్ ఎన్వీ రమణ మాట్లాడుతూ.. ప్రపంచంలో అనేక సమస్యలున్నాయన్నారు. ఉగ్రవాదం, సైబర్ క్రైమ్ ప్రధాన సమస్యలు అని ఆయన స్పష్టం చేశారు. కొత్త ఆలోచనలతో న్యాయ వ్యవస్థ ముందుకు రావాలని రమణ సూచించారు. వివిధ దేశాల న్యాయనిపుణులను ఈ సదస్సు ఒకే వేదికపైకి తెచ్చిందన్నారు. ప్రతి ఒక్కరూ తమ అభిప్రాయాలు పంచుకోవాలి.. సమస్యల పరిష్కారానికి అందరం కలిసి పని చేయాలి. తమది వసుధైక కుటుంబం అని ఆయన పేర్కొన్నారు. మహిళలు అనేక రంగాల్లో ముందున్నారని జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. ఈ సదస్సులో సీజేఐ జస్టిస్ బోబ్డే, జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్‌తో పాటు 24 దేశాల నుంచి న్యాయనిపుణులు పాల్గొన్నారు.




న్యూఢిల్లీలో అంతర్జాతీయ న్యాయసదస్సులో పాల్గొన్న ప్రధాని మోదీ, కేంద్ర న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాదం,సుప్రీం చీఫ్ జస్టిస్ ఎస్ఏ బోబ్డే

# కాశ్మీర్ ఎదురు కాల్పుల్లో ఇద్దరు ముష్కరుల హతం

శ్రీనగర్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): జమ్ము కశ్మీర్ రాష్ట్రం అనంత్ నాగ్ జిల్లా బిజ్ బెరాలో శనివారం ఉదయం భద్రతా బలగాలు, తీవ్రవాదులకు మధ్య ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ కాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతమయ్యారు. ఘటనా స్థలం నుంచి ఆయుధాలు, మందు గుండు సామాగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మృతి చెందిన తీవ్రవాదులు లష్కరే తోయిబాకు చెందిన వారుగా గుర్తించారు.

# సీఎం కేసీఆర్‌కు అరుదైన అవకాశం

## ట్రంప్‌కు ఇచ్చే విందులో పాల్గొనాలని పిలుపు
## రాష్ట్రపతి భవన్ నుంచి అధికారిక ఆహ్వానం

హైదరాబాద్,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అరుదైన ఆహ్వానం అందింది. అమెరికా ప్రసిడెంట్ ట్రంప్ గౌరవార్థం భారత రాష్ట్రపతి ఇచ్చే విందులో పాల్గొనాలంటూ సీఎం కేసీఆర్‌కు రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం వచ్చింది. ఈనెల 25న రాష్ట్రపతి భవన్‌లో ఇచ్చే విందులో ప్రధాని మోదీతో పాటు కొందరు కేంద్రమంత్రులు మాత్రమే పాల్గొంటారు.

అటు అస్సాం, హర్యానా, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా ముఖ్యమంత్రులకు సైతం ఆహ్వానం అందింది. ఈమేరకు 25వ తేదీ మధ్యాహ్నం సీఎం కేసీఆర్ ఢిల్లీ వెళ్లనున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 24, 25 తేదీల్లో ఇండియాలో పర్యటించనున్నారు. ట్రంప్ పర్యటన నేపథ్యంలో ఢిల్లీతో పాటు అహ్మదాబాద్‌లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. అయితే 25వ తేదీన రాష్ట్రపతి భవన్‌లో ట్రంప్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. గౌరవార్థం విందు ఏర్పాటు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సీఎం కేసీఆర్‌కు అరుదైన అవకాశం లభించింది. ట్రంప్‌కు గౌరవార్థం ఇచ్చే విందులో పాల్గొనాలని రాష్ట్రపతి భవన్ నుంచి సీఎం కేసీఆర్‌కు ఆహ్వానం అందింది. ప్రధాని మోదీతో సహా కొద్దిమంది కేంద్రమంత్రులు, కొన్ని రాష్ట్రాల సీఎంలకు మాత్రమే ఆహ్వానం అందింది. అందులో కెసిఆర్‌కు కూడా ఆహ్వానం రావడం విశేషం. రాష్ట్రపతి భవన్ నుంచి ఆహ్వానం అందిన రాష్ట్రాలు.. అసోం, హర్యానా, కర్ణాటక, బీహార్, మహారాష్ట్ర, తమిళనాడు, ఒడిశా, తెలంగాణ మాత్రమే. ఈ క్రమంలో సీఎం కేసీఆర్ 25వ తేదీ మధ్యాహ్నం ఢిల్లీకి వెళ్లనున్నారు. అయితే ప్రధాని నరేంద్ర మోదీ 25వ తేదీ మధ్యాహ్నం ట్రంప్‌కు లంచ్ ఏర్పాటు చేయనున్నారు. ఇక రాష్ట్రపతి భవన్‌లో విందు కార్యక్రమం ముగిశాక.. రాత్రి 10 గంటల సమయంలో ట్రంప్ అమెరికాకు బయల్దేరి వెళ్లనున్నారు.




హైదరాబాద్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో జరిగిన అగ్రిటెక్ కార్యక్రమంలో పాల్గొని రైతుకు ట్రాక్టర్ కీ అందచేసిన ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు. చిత్రంలో మంత్రులు మహ్మూద్ అలీ, నిరజన్ రెడ్డి, విసి ప్రవీణ్ రావు ఉన్నారు.

# పాలమూరులో 24న పట్టణ ప్రగతికి శ్రీకారం

## ప్రారంభోత్సవానికి రానున్న మంత్రి కెటిఆర్
## ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి శ్రీనివాసగౌడ్

మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 22 (ఆర్ఎన్ఎ): మంత్రి కేటీఆర్ సారథ్యంలో రాష్ట్రంలో మున్సిపాలిటీలు అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నాయని మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. రాష్ట్రంలో కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడంతో పాటు వాటిని అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఈ నెల 24వ తేదీన మహబూబ్‌నగర్ మున్సిపాలిటీలో పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మంత్రి కేటీఆర్ హాజరుకానున్నారు. ఈ మేరకు పర్యటన ఏర్పాట్లను మంత్రి శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షించారు. జడ్పీ గ్రౌండ్‌లో ఏర్పాటు చేయనున్న బహిరంగ సభ పనులను పరిశీలించారు. పట్టణ ప్రగతి కార్యక్రమం ప్రారంభోత్సవంతో పాటు.. అదే రోజు వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రి కేటీఆర్ పాల్గొననున్నారు. కేటీఆర్ పర్యటనకు సంబంధించి పట్టణంలోని డైట్ కళాశాల, బాలుర జూనియర్ కళాశాల మైదానం, జెడ్పీ మైదానం, రోడ్లు, సహా పలు వార్డుల్లో ఏర్పాట్లను పరిశీలించారు. మహబూబ్‌నగర్‌లో హైదరాబాద్ మాదిరి అభివృద్ధిని చేసిన ఘనత కేటీఆర్‌కే దక్కుతుందన్నారు. ఐటీ పార్క్, పరిశ్రమలు, పార్కులు వంటి సౌకర్యాలతో పట్టణం అభివృద్ధి చెందుతోందన్నారు. 5 ఏళ్లుగా జిల్లా అభివృద్ధి కోసం కేటీఆర్ ఎంతో కృషి చేశారని, ఆయన వస్తే ఈ పట్టణంలో మరింత అభివృద్ధికి అవకాశం ఏర్పడుతుందన్నారు. మహబూబనగర్ ఎంపీగా పనిచేసిన సీఎం కేసీఆర్‌కు ఈ ప్రాంతంపై ప్రత్యేక అభిమానం,శ్రద్ధ ఉందన్నారు. నీళ్లు,కరెంటు ఎలా వస్తున్నాయని సీఎం ఆరా తీస్తుంటారని మంత్రి తెలిపారు.

మహబూబ్‌నగర్, భూ త్పూర్, జడ్చర్లను కలిపి భవిష్యత్తులో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణాల్లో కొత్తగా వెజ్, నాన్ వెజ్ మార్కెట్లు ఏర్పాటు చేసి మార్కెట్ల సమస్య తీర్చనున్నట్లు తెలిపారు. వార్డుల్లో 60 మందితో వేసే కమిటీలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. పట్టణాల్లో అభివృద్ధిని సాధ్యం చేసేందురు రాష్ట్రం ఏర్పడిన తర్వాత దాదాపు 70 కొత్త మున్సిపాలిటీలు, 12 కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఘనత టీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. ప్రతి పట్టణంలో తాగునీరు, విద్యుత్, మౌలిక సదుపాయాలు అందిస్తూ ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌కే దక్కుతుందన్నారు.

# ట్రంప్‌తో ఆగ్రా పర్యటనకు ప్రధాని మోడీ దూరం

## ఇది కేవలం ట్రంప్‌కు సంబంధించిన పర్యటన మాత్రమే
## మోడీ వెళ్లబోరని స్పష్టీకరించిన కేంద్ర ప్రభుత్వం
## ఆగ్రారూట్‌లో డేగకళ్లతో భద్రతా ఏర్పాట్లు
## పెట్రోల్ బంకులను ఖాళీచేయిస్తున్న అధికారులు

న్యూఢిల్లీ,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రా సందర్శిస్తారని మీడియాలో వస్తున్న వార్తల్ని కేంద్ర ప్రభుత్వం కొట్టిపడేసింది. ప్రధాని నరేంద్ర మోదీ డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి ఆగ్రా సందర్శనకు వెళ్లబోవడంలేదని ప్రభుత్వం స్పష్టం చేసింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, మొదటి మహిళ మెలానియా ఆగ్రా సందర్శనలో భారత్ తరపున ఏ ఒక్క అధికారిక ప్రతినిధి కూడా భాగం కావటం లేదని అధికారిక వర్గాల సమాచారం. ప్రధాని మోదీ, ట్రంప్‌తో కలిసి ఈ నెల 24న అహ్మదాబాద్‌లో పర్యటిస్తారని, అనంతరం 25 ఢిల్లీలో జరగనున్న అధికారిక కార్యక్రమాల్లో మాత్రమే మోడీ పాల్గొంటారని తెలుస్తోంది. కాగా, ఈనెల 24, 25 తేదీల్లో ట్రంప్ భారత్‌లో పర్యటించనున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయనతో పాటు పలువురు ఆయన భార్య, అమెరికా మొదటి మహిళ మెలానియా ట్రంప్, కూతురు, సలహాదారు ఇవాంకా ట్రంప్, అల్లుడు జరెడ్ కుష్నర్‌తో పాటు పెద్ద సంఖ్యలో అమెరికా అధికారులు భారత్‌కు వస్తున్నారు. పర్యటనలో భాగంగా మెలానియా ట్రంప్ ఢిల్లీలోని ఓ స్కూల్‌లో జరగబోయే కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రివాల్, ఉపముఖ్యమంత్రి మనిష్ సిసోడియా పాల్గొనాల్సి ఉండింది. అయితే కేజ్రివాల్, మనిష్ సిసోడియాలు తమ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నట్లు అధికారిక సమాచారం. మరోవైపు ట్రంప్ పర్యటన నేపథ్యంలో భారీ భద్రత ఏర్పాటు చేస్తున్నారు. అడుగడుగునా డేగ కళ్లతో నిఘా.. ఎక్కడికక్కడ చెకింగ్ చేస్తున్నారు. ఆయన వచ్చిన రోజున ఆగ్రాలోని తాజ్ మహల్ సందర్శనకు వెళ్తున్నారు. ఈ సందర్భంగా ఆయన వెళ్లే రూట్‌లో ఉన్న పెట్రోల్ బంకుల్లో స్టాక్ మొత్తం ఖాళీ చేయాలని యజమానులను పోలీసులు ఆదేశించారు. అలాగే ఆ రోజున పర్యాటకులను తాజ్ మహల్ దగ్గరకు అనుమతించకూడదని నిర్ణయం తీసుకున్నారు. ట్రంప్ భద్రత దృష్ట్యా ముందు జాగ్రత్తగా 12 గంటల నుంచే అక్కడికి ఎవరూ రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రోహన్ ప్రమోద్ తెలిపారు. తాజ్ మహల్ సందర్శనకు ట్రంప్ వెంట ఆయన భార్య మెలనియా ట్రంప్, కుమార్తె ఇవాంక కూడా వస్తున్నారు. భద్రత ఏర్పాట్లలో భాగంగా ట్రంప్ తాజ్ మహల్ దగ్గరకు వెళ్లే రూట్ అంతా పోలీసులు తమ కంట్రోల్‌లోకి తీసుకున్నారు. ఆయన కారు వెళ్లే దారిలోని అన్ని ఇళ్లు, షాపులు, హోటళ్లను ఇప్పటికే తనిఖీ చేశారు. షాపు యజమానులతో పాటూ ప్రతి ఇంటిలోనూ ఆధార్ కార్డులు అడిగి చెక్ చేశారు. సిటీలో ఆయన వెళ్లే రూట్‌లో మూడు పెట్రోల్ బంకులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ట్రంప్ వచ్చే ముందు ఆయా బంకుల్లో ఆయిల్ పూర్తిగా ఖాళీ చేయాలని వాటి యజమానులను ఆదేశించారు.

# సవాళ్లను ఎదుర్కొంటున్న వ్యవసాయరంగం

## వ్యవసాయరంగాన్ని రైతులను ఆదుకోవాలి
## పెట్టుబడులు, కూలీల కొరత దృష్ట్యా సేద్యంలో నష్టాలు
## అగ్రివిజన్ 2020 సదస్సులో ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

హైదరాబాద్,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కోరారు. దేశంలో వ్యవసాయ రంగం, రైతాంగాన్ని రక్షించుకోవడానికి శాస్త్రవేత్తలు, పరిశ్రమ వర్గాలు కృషి చేయాలని వెంకయ్యనాయుడు అన్నారు. దేశంలో వ్యవసాయ రంగాన్ని అనేక సవాళ్లు వేధిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. సమయానుకూలంగా వ్యవసాయంలో వస్తున్న మార్పులను ఉపయోగించుకోవాలని సూచించారు. విస్తృతమైన మార్కెట్, గోదాముల సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. రైతులకు సకాలంలో విత్తనాలు, కల్తీలేని మందులు అందించాలన్నారు. ప్రొపెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీ ఆడిటోరియంలో అగ్రివిజన్ 2020 పేరుతో వ్యవసాయ సదస్సు జరుగుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ సదస్సును ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయకంగా అవకాశాలను అందిపుచ్చు కోవాలన్నారు. సేంద్రియ వ్యవసాయానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు.

వాతావరణ మార్పుల నేపథ్యంలో పెరుగుతున్న పెట్టుబడులు, కూలీల కొరత దృష్ట్యా సేద్యం లాభసాటిగా ఉండటం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. చాలామంది రైతులు వ్యవసాయం వదిలేసి ప్రత్యామ్నాయ వృత్తుల్లోకి వెళుతున్నారని అన్నారు. ఆ లోపాలు గుర్తించి వ్యవసాయాన్ని సుస్థిరంగా తీర్చిదిద్దేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం, పీజేటీఎస్ఏయూ, సీఐఐ కలికట్టుగా వ్యవసాయాన్ని లాభసాటిగా తీర్చిదిద్దినట్లైతే రైతుల ఆదాయాలు మరింత పెరుగుతాయని వివరించారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి సరిపోదని.. ఉత్పాదకత పెరగాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. భారత్ కంటే అతి చిన్న దేశం వియత్నాంలో వరి ఉత్పత్తి పది రెట్లు అధికమని చెప్పారు. కాఫీ ఉత్పత్తిలోనూ అదే పరిస్థితి ఉందని.. ఉత్పత్తి, ఉత్పాదకతలో ఎక్కడ లోపాలు ఉన్నాయో గుర్తించి వాటిని అధిగమించేందుకు శాస్త్రవేత్తలు కృషి చేయాలని ఉపరాష్ట్రపతి సూచించారు. వ్యవసాయ రంగం, రైతాంగం బలోపేతం కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. రైతు బంధు, రైతు బీమా, వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంటు, నీటి పారుదల ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోందని మంత్రి వివరించారు. ఈ కార్యక్రమంలో హోం మంత్రి మహమూద్ అలీ, ప్రొఫెసర్ జయశంకర్ వర్సిటీ ఉపకులపతి డాక్టర్ వెల్చాల ప్రవీణ్ రావు, పూర్వ ఉప కులపతులు, ఐసీఏఆర్ అనుబంధ సంస్థల సంచాలకులు, శాస్త్రవేత్తలు, రైతులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో మరోమారు బంగారం పట్టివేత

హైదరాబాద్,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ విమానాశ్రయంలో అక్రమంగా తరలిస్తున్న బంగారం పట్టుబడింది. దోహా నుంచి వచ్చిన ప్రయాణికులను కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఇద్దరు వ్యక్తుల వద్ద 600 గ్రాముల బంగారం లభ్యమయింది. బంగారానికి సంబంధించి.. ఆధారాలు చూపించమని కస్టమ్స్ అధికారులు, సదరు ప్రయాణికులను ప్రశ్నించగా.. వారి వద్ద నుంచి సమాధానం రాలేదు. దీంతో, సదరు వ్యక్తులు బంగారాన్ని అక్రమంగా తరలిస్తున్నారని ధృవీకరించుకున్న అధికారులు.. వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించి. విచారణ కొనసాగుతోంది.

# శివరాత్రి అగ్నిగుండాల్లో అపశృతి

## తోపులాటలో అగ్నిగుండంలో పడ్డ భక్తులు
## ఆరుగురికి తీవ్ర గాయాలు...ఆస్పత్రికి తరలింపు

నల్గొండ,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం గుడివాడ గ్రామంలో నిర్వహించిన అగ్నిగుండం కార్యక్రమంలో అపశృతి చోటుచేసుకుంది. ప్రతి ఏడాది శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామంలోని పాత శివాలయం దగ్గర కార్యక్రమాన్ని జరుపుతారు. ఈ నేపథ్యంలో అగ్నిగుండంలో నడుస్తుండగా తోపులాట జరిగి ప్రమాదవశాత్తు ఆరుగురు భక్తులు అగ్నిగుండంలో పడిపోయారు. వారిలో ఇద్దరి భక్తుల పరిస్థితి విషమంగా ఉండడంతో ఆసుపత్రికి తరలించారు. అగ్నిగుండంలో నడుస్తుండగా భక్తులు ఒక్కసారిగా తోసుకోవడంతోనే ఈ ప్రమాదం చోటుచేసుకుందని గ్రామస్తులు పేర్కొన్నారు.

## చరిత్రలో నేటినిజం




కం॥ మారని ఆ కేర్శకానూ
తీరగు తేని కట్టుబూడు దివ్యాపథములలో
గారడి చేయు "ప్రతుల స
ర్కారు"కు నేనందు జేయు కైమోడ్పిదియే!!

(ఫిబ్రవరి 23 ఇంద్ర జాలికుడు ప్రతుల చంద్రసర్కార్ జయంతి..)



–రాధశ్రీ
సెల్: 9494481210




హైదరాబాద్ శివారులోని పీర్జాదిగూడా మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డి. చిత్రంలో రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ తదితరులు ఉన్నారు.

# ఒక్కసారి ఆలోచించండి..!

నేటినిజం
ఆదివారం 23-2-2020

అనుభవం ఎదురవనంతవరకు మనం ఎన్ని విషయాలైనా, ఎన్ని పరిష్కారాలైనా ఎదుటివారికి చెప్పేస్తుంటాం! ఇక దైవం చూపే శక్తి గురించి ఎలా వర్ణించగలం? ఎలా నమ్మించగలం? దేవుడున్నాడు అనేది నీ పూర్తి నమ్మకం అయినపుడు ఆ నమ్మకాన్ని మరొకరికి ఎలా ఆపాదించగలం? మనసులో ఉన్నది మనిషైనా, దేవుడైనా జాగృతం చేసి అనుభవంలోకి తెచ్చుకున్న తర్వాతే ఎవరైనా నమ్మగలుగుతారు. మన సంకల్పాలు నెరవేరకుండా విఘ్నాలు కలుగుతున్నపుడు మానవాతీత శక్తి పనిచేసి మనల్ని మనతోనే నిత్యం నడిపించగలుగుతున్నపుడు ఎదురయ్యే అనుభవాలే జీవితం. ఎదురుచూడకుండా ఎదురయ్యే అనుభవాలే దైవం. ఏదయినా నమ్మి ఆచరించడంలోనే ఆనందం ఉంటుంది. నమ్మకం కలిగించుకోవడంలోనే సుఖసంతోషాలు ఉంటాయి, కష్టపడతాం. ఎదురుచూస్తాం. ఆశపడతాం. అయినా వీటన్నింటితోపాటు దైవశక్తి అనుకూలించాలి.

జన్మించే ప్రతి కొత్త శిశువు ఇంకా సృష్టి నడుస్తుందనే విషయానికి నిదర్శనం. ఎవరూ అక్కర్లేదు. అసలు సృష్టే అక్కరలేదు అని దేవుడు అనుకుంటే చాలు ఈ విశ్వం ఆగిపోతుంది. ఎవరికోసం ఎవరు ఈ పనిచేస్తున్నారు? అని దేవుడిని అర్థం చేసుకునేవారు ఎంతమంది ఉన్నారు? దైవానుభవం కోసం అర్రులు చాచే వారు ఎంతమంది ఉన్నారు? అనుకుంటే మనం కాస్సేపు ఆలోచనలో పడిపోక తప్పదు.

ప్రకృతిని చూస్తాం. ఆనందిస్తాం. అందమైన మనిషిని చూసినా అబ్బ! ఎంతటి సౌందర్యం కదా అనుకుంటాం.

కానీ అంత మన కళ్ళను కట్టిపడేసే అందం భగవంతుడు సృష్టే కదా? మన ఆ భావాల్లోకి విస్తరించినపుడు తోలుబొమ్మలుగానే మిగిలిపోతాం. ఆధునిక మహాయుగ యాంత్రికతలో పడి కొట్టుకుపోయి మానవ జీవన పరమార్థం మరచిపోతాం. అనుభవాలు సులువుగా రావు. ఎముకలు పుల్లలై పోవాలి.

అనుభవాలు అలవాటుగా రావు నాలుక తడారిపోవాలి. ఆశ కనుచూపు మేరలో లేకుండా పోవాలి. నిరంతరం తపస్సులా ధ్యానం చేయాలి. ఊపిరిలో ఊపిరిగా దైవాభావం ఉండిపోవాలి. ఈ మాటలు నిజమా కాదా అని ఒక్కసారి ఆలోచించండి! దేని కోసం మనం నిత్యం ఆరాటపడుతున్నాం? దేనిని మనం పూర్తిగా విస్మరిస్తున్నాం? తెలుస్తోందా? కడుపు నిండిన మహారాజులు ఎన్నైనా చెబుతారు అంటారా? చెప్పడానికి ఆకలేంటి? భారమేంటి? ఆలోచించండి! ఇందుకు మీకో ఉదాహరణ చెప్పాలి. ముక్కు మూసుకుని గులాబీపూల మధ్య తిరిగితే పరిమళం వస్తుందా? కళ్ళుమూసుకుని ఆకాశం వైపు చూస్తే కనిపిస్తుందా? చెవులు మూసుకుని ఉద్యానవనంలో తిరిగితే పక్షుల కిలకిలా రావాలు వినిపిస్తాయా? హృదయాన్ని బంధించి భగవన్నామస్మరణ అంటే తలకెక్కుతుందా? అంటే వీటిక్కూడా తర్కవితర్కాలు పనిచేస్తాయా? అంటే ఏమీ చేయలేము కానీ దేనికైనా తర్కం ఉండాలి. ఏమాత్రం నచ్చని వితర్కం ఉండితీరాలి. ప్రేమతో దివ్యమైన భావాలతో ఆరాధిస్తే, స్తుతిస్తే, ఆక్రోశిస్తే ఇక భగవంతుడు మన ముందుకు కాకుండా, మన ఆవేదనను తీర్చకుండా ఎలా ఉంటాడు? అనేది కూడా ఆలోచించండి..! మన రూపం మనకు కనిపిస్తుంది..!!

## తలంబ్రాలకు 150 క్వింటాళ్ల బియ్యం

### మార్చి 9న కల్యాణ తలంబ్రాలను కలిపే ఉత్సవం

### ఎప్రిల్ 2న వైభవోపేతంగా సీతారామ కళ్యాణం

భద్రాద్రి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): భద్రాద్రిలో కొలువైన సీతారాముల వారి దర్శనం పరమానందభరిత భరితంగా భావిస్తాం. జగన్మాత సీతమ్మకు జగదానందకారకుడైన రామయ్యకు కల్యాణ మహోత్సవం ఏప్రిల్ 2న ఘనంగా నిర్వహించేందుకు ముహూర్తం కుదిరింది. ఇప్పటికే కలెక్టర్ ఎంవీ రెడ్డి ఇక్కడ పర్యటించి ఎలాంటి పనులు చేపట్టాలనేది ఈవో నరసింహులుతో సమాలోచనలు చేశారు. త్వరలోనే సమన్వయ సమావేశం ఏర్పాటు చేసేందుకు సమాయత్తమయ్యారు. వచ్చే నెల 9న కల్యాణ తలంబ్రాలను కలిపే ఉత్సవాన్ని ప్రారంభిస్తారు. ఆ తర్వాత నుంచి కల్యాణ క్రతువుకు సంబంధించిన హడావుడి కనిపించనుంది. రెండేళ్ల కిందట 100 క్వింటాళ్ల తలంబ్రాలను తయారు చేసేవారు. వీటికి ఆదరణ పెరగడంతో గత ఏడాది మొత్తంగా 150 క్వింటాళ్లను సిద్ధం చేశారు. వీటిని భక్తులు ఆలయానికి కానుకగా అందించేందుకు ఆసక్తిని చూపిస్తున్నారు. చీరాలకు చెందిన భక్తులు ఇంతకు ముందు 100 క్వింటాళ్లకు పైగా స్వామివారికి సమర్పించారు. ఈసారి 150 క్వింటాళ్లను అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. వీటితో పాటు సరిపడా సుగంధ ద్రవ్యాలను ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన భక్తులు పాదయాత్రగా సుమారు 10 వేల మంది రానున్నారు. వీళ్లూ తలంబ్రాల బియ్యాన్ని తీసుకుని వచ్చేందుకు కసరత్తు చేపట్టారు. అలాగే 100 కిలోల ముత్యాలు అవసరం. ఇందులో కొన్ని విరాళంగా వస్తున్నప్పటికీ ఈ మొత్తం దాతల ద్వారా సేకరిస్తే ఆర్థిక భారం తగ్గించొచ్చు ఇంకొంత మంది దాతల ద్వారా అన్నదానానికి అవసరమైన సరకులు వచ్చే వీలుంది. దాతలను ఆకట్టుకునేందుకు అధికారులు చొరవ చూపితే మంచిదన్న భావన ఉంది. ఈ నేపథ్యంలో తలంబ్రాలను ఏ స్థాయిలో తయారు చేయాల్సి ఉంటుందో వైదిక పెద్దలతో చర్చలు సాగిస్తున్నారు. భక్తులపరంగా ఇదో పెద్ద ఉత్సవమే. నేరుగా స్వామివారి కల్యాణ తలంబ్రాలను కలిపే భాగ్యం దక్కుతుందని ఆ రోజు కోసం ఎదురు చూస్తున్నారు. తలంబ్రాలను కలిపే రోజు పసుపు కొమ్ములు దంచి బియ్యం, నూనె, నెయ్యి, పసుపు, కుంకుమ, గులాలు, సెంటు, రోజ్ వాటర్తో సుగంధ భరితమైన అక్షతలను తయారు చేస్తారు. ఎంతో విశిష్టమైనవి భద్రాచలం కల్యాణ తలంబ్రాలు. ఎప్పటికీ మంచిగా ఉండే అక్షతలను భక్తులు తీసుకునేందుకు వీలుగా శ్రీరామ నవమికి ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్త బృందాలు ఒక్క పూట నిద్ర చేసి స్నానాదులు చేసేందుకు గాను అంబాసత్రం వద్ద కొంత స్థలాన్ని గుర్తించారు. సుమారు రూ.అరకోటి వెచ్చించి మరుగు దొడ్లు, స్నానాల గదులతో పాటు విశ్రాంతికి పెద్ద గదులను నిర్మించాలనుకున్నారు. ఈ ఖర్చును భక్తులు కొంత భరించే వీలున్నప్పటికీ దేవాదాయ శాఖ దస్త్రాన్ని కదపకుండా మోకాలడ్డుతోంది.ఉగాది నుంచి ఆహ్వానాలుమార్చి 25 నుంచి ఏప్రిల్ 8 వరకు శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాలు ఉంటాయి. ఇందులో తొలి రోజైన ఉగాది నుంచి ఆహ్వాన పత్రికలను అందించే వీలుంది. కల్యాణ మండపం ప్రాంగణంలో 35 వేల మందికి ప్రవేశం ఉండగా ఇందులో 15 వేల మందికి ఉచిత ప్రవేశం కల్పిస్తున్నారు. 20 వేల మందికి టిక్కెట్లను విక్రయిస్తారు. అన్నింటికీ మించి రామాలయానికి నిధుల కొరత పట్టి పీడిస్తోంది. రూ.కోటికి పైగా ఈ ఉత్సవానికి ఖర్చు చేయాల్సిందే. హుండీలు, టిక్కెట్ల రూపంలో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు, దాతలకు సౌకర్యాలను కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారు. అంబాసత్రం వైపు ఖాళీ స్థలంలో నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కల్యాణ తలంబ్రాల బియ్యాన్ని చీరాల భక్తులు ఇచ్చేందుకు అంగీకరించారు. స్వామివారికి దాతలు తమకు తోచిన సాయం చేయాలని కోరుతున్నట్లు అధికారులు తెలిపారు.

## డల్లాస్‌లో సిద్దిపేట జిల్లా టెక్కీ మృతి

### గుండెపోటుతో మృతితో కటుంబంలో విషాదం

### తెల్లవారే భార్య ప్రసవం

సిద్దిపేట,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): అమెరికాలోని డల్లాస్‌లో తెలుగు టెకీ గుండెపోటుతో మరణించాడు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి(39) ఈనెల 19న అతడు పనిచేస్తున్న కార్యాలయంలోనే గుండెపోటుతో చనిపోయాడు. దీంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. నిండుగర్భవతిగా ఉన్న భార్యకు ఈ విసయం ముందే తెలపలేదు. వడ్డేపల్లికి చెందిన విశ్రాంత తహసీల్దార్ సుధాకర్ రెడ్డి రెండో కుమారుడు ప్రశాంత్ రెడ్డి పదేళ్ల క్రితం ఉద్యోగరీత్యా అమెరికాకు వెళ్లాడు. డల్లాస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడ గుండెపోటుకు గురయ్యాడు. ప్రశాంత్ భార్య దివ్య ప్రసవానికి ఒక రోజు ముందు జరిగిన ఈ ఘటన వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఇక ప్రశాంత్ మృతిచెందిన విషయం తెలుసుకున్న అతని స్నేహితుడు సంతోష్... డల్లాస్‌లో జరిగే అంత్యక్రియలకు మృతుని సోదరుడు ప్రమోద్ వెళ్లేందు వీసా ఇప్పించాలని ట్విట్టర్ ద్వారా మంత్రి కేటీఆర్‌ను కోరారు. వెంటనే స్పందించిన కేటీఆర్ ప్రశాంత్ రెడ్డి సోదరుడు ప్రమోద్ రెడ్డికి తాత్కాలిక వీసా అందించాలని బేగంపేటలోని అమెరికా ఎంబసీకి తెలియజేసి వీసా ఇప్పించారు. దీంతో ప్రమోద్ రెడ్డి శుక్రవారం అమెరికా బయలుదేరి వెళ్లాడు. కాగా, ప్రశాంత్ రెడ్డికి గ్రీన్ కార్డు ఉండడంతో ఆయన అంత్యక్రియలు అక్కడే జరుగనున్నాయి. ఇదిలాఉండగా మృతుడి భార్య దివ్య ఈనెల 20న ఓ పాపకు జన్మనిచ్చింది. ప్రసవం తర్వాత ఆమెకు భర్త చనిపోయిన విషయం తెలియజేశారు. ఈ దంపతులకు ఇంతకుముందు మూడేళ్ల పాప ఉంది.

## మార్చిలో బ్యాంకులకు వరుసగా సెలవులు

### సమ్మెకు తోడు వరుస హాలిడేస్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): మార్చిలో బ్యాంకులకు వరుస సెలవులు రానున్నాయి. 10 వ తేదీ నుంచి 15వ తేదీ వరకు వరుసగా సెలవులు వచ్చాయి. ఇలా ఒకేసారి బ్యాంకు కార్యకలాపాలు నిలిచిపోవడంతో ఖాతాదారులు అసౌకర్యానికి గురి కావాల్సిందే. దీంతో ముందు జాగ్రత్తగా ఇప్పుడే ప్లాన్ చేసుకుంటే మంచిదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వేతనాలు పెంపును కోరుతూ బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా,ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సంయుక్తంగా బంద్‌కు పిలుపునిచ్చాయి. మార్చి 11 నుంచి 13 వరకు మూడు రోజులపాటు దేశవ్యాప్తంగా ఈ సమ్మె నిర్వహించనున్నారు.మార్చి 10 వ తేదీన హోలీ కావడంతో ఆ రోజు కూడా బ్యాంకులకు సెలవు ఉంటుంది. ఇక మార్చి 14 రెండవ శనివారం, మార్చి 15 ఆదివారం కారణంగా వరుసగా ఆరు రోజులు బ్యాంకు మూతపడనున్నాయి.

## చెరువులోకి దూసుకెళ్లిన కారు-ముగ్గురు మృతి

యాదాద్రిభువనగిరి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): రామన్నపేట మండలం వెల్లంకి చెరువులోకి ఓ కారు దూసుకెళ్లింది.

ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మృతులు సర్నేనిగూడెం సర్పంచ్ భర్త మధు, కొడుకు మణికంఠ, కారు డ్రైవర్ శ్రీధర్ రెడ్డిగా పోలీసులు గుర్తించారు. శుక్రవారం సాయంత్రం వ్యవసాయ బావి వద్దకు వెళ్లిస్తామని ముగ్గురూ కారులో వెళ్లారు. తరవాత వారు ఎంతకే తిరిగిరాలేదు. ఆచూకీ కోసం గాలిస్తుండగా వీరి కారు చెరువులో కనిపించింది.

కారుతో పాటు మృతదేహాలను వెలికితీశారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య దగ్గర ఉండి పర్యవేక్షిస్తున్నారు.

# మిషన్ భగీరథలో లోపించిన చిత్తశుద్ధి

హైదరాబాద్, ఫిబ్రవరి 22:ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించి చేపట్టిన మిషన్ భగీరథ పథకం నీరుగారుతోంది. అధికారుల నిర్లక్ష్యం కారణంగా పూర్తిస్థాయిలో మంచినీటి సరఫరా జరగడం లేదు. ఈ పథకాన్ని త్వరగా పూర్తి చేయాలనే సంకల్పంతో ప్రారంభం చేసినా,అధికారులు నిర్లక్ష్యంతో ఈ పథకం ద్వారా ఇప్పటి వరకు ప్రజలకు పూర్తిస్థాయిలో నీటిని అందించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. అధికార యంత్రాంగం విఫలమయ్యిందనే ఆరోపణలు జోరుగా ఉన్నాయి. ఈ పథకం ప్రారంభించే సమయంలో ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ నీటిని అందించాలన్న సంకల్పాన్ని సిఎం కెసిఆర్ ప్రకటించారు. ఇంతటి గొప్ప లక్ష్యంతో మిషన్ భగీరథ పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఒక దశలో అందించిన తరువాతనే ఓటు అడిగేందుకు వస్తామని లేకపోతే ఓట్లు అడగమని ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా ప్రకటించారంటే అయ్యిందో తెలుస్తోంది. కానీ కొంతమంది ఈ ప్రభుత్వం మూటగట్టుకోవాల్సి వస్తోంది. ఈ అపవాదులను పోగొట్టుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం మిషన్ భగీరథ పథకం పనులు సాధ్యమైనంత వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు తాగునీటిని అం దించాలనే సంకల్పంతో అధికారులపై ఒత్తిడి పెంచింది. దీంతో ఈ వేసవి ఆరంభానికి ముందే మిషన్ భగీరథ పనులు పూర్తి చేసుకొని ప్రతి ఆవాసానికి శుద్ధ జలాన్ని అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిస్థితి ఇలానే కొనసాగితే రాబోయే వేసవిలో మిషన్ భగీరథ నీటిని అందించాలనే ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోక తప్పదని పలువురు భావిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి మిషన్ భగీరథ పనుల నిర్వహణ తీరును క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి లోపాలను గుర్తిస్తే రాబోయే వేసవిలో ప్రజలకు శుద్ధజలాన్ని అందించవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఈ తరుణంలో క్షేత్రస్థాయిలో పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లాస్థాయి అధికారులకు ఇటీవల రాష్ట్ర ఉన్నత స్థాయి అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పనులు పూర్తయి రానున్న వేసవిలో ప్రజలకు మిషన్ భగీరథ నీటిని అందిస్తామని అధికారులు చెబుతున్న ప్పటికీ వాస్తవ పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతీ ఇంటికి శుద్ధజలం అందించాలనే గొప్ప లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలో ప్రారంభించిన మిషన్ భగీరథ పనులు పలు జిల్లాల్లో నత్తనడకన సాగుతున్నాయి. దీంతో ప్రతి ఇంటికి శుద్ధ జలాన్ని అందించాలనే ప్రభుత్వం లక్ష్యం నానాటికి ఆలస్యంగా మారుతోంది. పనులు నిర్వహణ ఆశించిన స్థాయిలో వేగంగా జరగకపోవడంతో ప్రభుత్వం అనుకున్న సమయానికి ప్రజలకు మిషన్ భగీరథ పథకం ద్వారా శుద్ధజలం అందేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటి వరకు పలుచోట్ల వాటర్ గ్రిడ్, ఇంట్రా విలేజ్ పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మిషన్ భగీరథ పనుల నిర్వహణ తీరుపై పలు జిల్లాల్లో మంత్రులు సైతం అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పనులను వేగంగా పూర్తి చేయాలని ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు సైతం ఉన్నాయి. పలుచోట్ల పైప్‌లైన్‌ల లీకేజీలు అధికారుల పర్యవేక్షణను వెక్కిరిస్తున్నాయి. పైప్‌లైన్‌లను మాత్రమే పూర్తి చేసిన అధికారులు వాటి నుంచి ప్రజలకు నీటిని అందించేందుకు నల్లాలను నమోదు చేయాల్సి ఉంది. పలుచోట్ల పైప్‌లైన్ లికేజీ కావడంతో నీరంతా వృథాగా పోతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. ఇకపోతే పనులు అయిపోయాయని అధికారులు చెబుతున్నా, అధికారులు చెబుతున్న మాటలకు క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులు పూర్తి భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. ఖచ్చితంగా ఈ వేసవిలో మిషన్ భగీరథ నీటిని ప్రతి గ్రామంలోని ప్రతి ఆవాసానికి అందించాలని రాష్ట్రస్థాయి అధికారుల నుంచి క్షేత్రస్థాయిలో పని చేస్తున్న అధికారులపై నానాటికి ఒత్తిడి పెరుగుతుండ డంతో పనులు పూర్తి కాకుండానే పనులు పూర్తి అయినట్లు ఆయా గ్రామాల సర్పంచ్ నుంచి తీర్మానాలను సేకరించి ఉన్నతాధికారులకు పంపుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పర్యవేక్షణ కొరవడడంతోనే సదరు గ్రామాల్లో పని చేస్తున్న కాంట్రాక్టర్లు పనులు పూర్తి అయినట్లు తప్పుడు తీర్మానాలను సమర్పిస్తూ ప్రభుత్వానికి తప్పుడు లెక్కలు చెబుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చాలా గ్రామాల్లో మిషన్ భగీరథ నీరు ఎప్పుడు వస్తాయో ఎప్పుడు పోతాయో ఎవరికి తెలియదన్న సమాధానం వస్తోంది.. ఇష్టానుసారంగా తాగు నీరు సరఫరా చేస్తున్నారు. తాగునీటి కోసం ఇబ్బందులు పడాల్సి వస్తోంది. భగీరథ పైప్‌లైన్‌కు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి తాగునీరు సక్రమంగా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. మార్చి నెలాఖరు వరకు జిల్లాల్లో మిషన్ భగీరథ పనులు పూర్తి చేస్తా అని అంటుననా అది సాధ్యం అయ్యేలా కనిపించడం లేదు. వందశాతం పనులు పూర్తి చేసి ఇంటింటికీ నీరు అందిస్తాం. ఎప్పటికప్పుడు మిషన్ భగీరథ పనులను పర్యవేక్షిస్తున్నాం. ప్రజలందరికీ తాగునీరు అందిస్తామని, ఆందోళన అవసరం లేదంటున్నారు. సిఎం కెసిఆర్ ఎప్పిటికప్పుడు ఆరా తీస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు ఉన్నత ఆశయంతో చేపట్టిన పథకాన్ని ముందుకు తసీఉకుని వెళ్లేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాల్సి ఉంది.

# ఎల్లంపల్లి ఉన్నా తాగునీటికి తిప్పలే

### తాగునీటి పథకంపై కంట్రాక్టర్ల నిర్లక్ష్యం ఫలితం

### మిషన్ భగీరథ పనులు పూర్తి కాక ప్రజలకు ఇక్కట్లు

మంచిర్యాల,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తయితే దాహార్తి తీరుతుందని భావించిన ప్రజల ఆశలు అడియాశలయ్యాయి. మిషన్ భగీరథ పనులు దాదాపు పూర్తికాగా జిల్లాలోని ఇతర ప్రాంతాలకు నీటి సరఫరా కూడా జరుగుతోంది. మిషన్ భగీరథ పథకం ద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జిల్లాలోని మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లోని దాదాపు 4 లక్షల మంది దాహార్తి తీరనుండగా మూడు మునిసిపాలిటీల పరిధిలోని ప్రజలకు రక్షిత మంచినీరు దొరకడం గగనంగా మారింది. దశాబ్దాల కాలంగా రక్షిత మంచినీటి కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురు చూస్తున్న జిల్లా వాసుల కోరిక ఇప్పట్లో తీరేలా లేదు. ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ సంవత్సరం మార్చి నెలాఖరులోపు మిషన్ భగీరథ పథకానికి సంబంధించి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించినప్పటికీ జిల్లాలోని మూడు మున్సిపాలిటీల్లో పూర్తయ్యే అవకాశాలు లేవు. ప్రస్తుత పరిస్థితులను బట్టి చూస్తే మరో రెండు సంవత్సరాలు గడిస్తేగానీ ప్రజలకు రక్షిత మంచి నీరు తాగే భాగ్యం కలిగే అవకాశాలు లేవు.ముఖ్యంగా జిల్లా కేంద్రంతోపాటు మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాలిటీల్లో ప్రజలు రక్షిత మంచినీటి కోసం మరింత కాలం ఆగక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు తలాపునే ఉన్నప్పటికీ ఆయా పట్టణాల్లో నివసిస్తున్న ప్రజల దాహార్తి తీరడంలేదు. మిషన్ భగీరథ పథకంలో భాగంగా మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి పట్టణాల ప్రజలకు రక్షిత తాగునీరు అందించేందుకు మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రజా ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో రూ. 131 కోట్ల అంచనా వ్యయంతో రక్షిత మంచినీటి పథకం ప్రణాళిక రూపొందించారు. 18 నెలల్లో పనులు పూర్తి చేసి, ప్రజలకు నిత్యం తాగునీరు అందించాల్సి ఉంది. కాంట్రాక్టర్‌తో జరిగిన ఒప్పందం ప్రకారం 2019 మార్చి నెలాఖరు కల్లా పనులు పూర్తి కావలసి ఉండగా, గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతున్నా 20 శాతం మేర పనులు పూర్తికాకపోవడం గమనార్హం. ఓవర్ హెడ్ ట్యాంకులు, సంపుల నిర్మాణ పనులు ఇంకా ప్రారంభ దశలోనే ఉన్నాయి. పనులకు సంబంధించి అగ్రిమెంట్ పూర్తయినప్పటికీ సదరు కాంట్రాక్టర్‌కు నిధులు మంజూరు చేయకపోవడంతోనే పనుల్లో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. టెండర్ ప్రక్రియ ముగిసి దాదాపు మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఇంత వరకు బ్యాంకులు రుణం మంజూరు చేయకపోవడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ప్రభుత్వం కూడా ఈ విషయంలో చొరవ తీసుకోకపోవడంతో బ్యాంకర్లు ముందుకు రాక కాంట్రాక్టరు ప్రారంభదశలోనే పనులను ఆపివేశాడు.ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి నీరు సరఫరా చేసేందుకు అవసరమైన వాటర్ గ్రిడ్ పనులు పూర్తయినా ప్రజలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. గ్రావిటీ ద్వారా మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి మున్సిపాలిటీలకు నీరు సరఫరా కావాల్సి ఉంది. గ్రిడ్ పనుల్లో భాగంగా ఆయా మున్సిపాలిటీ పరిధిలో ఎక్కడికక్కడే అవుట్‌లెట్ ఇచ్చి వదిలేశారు. మిషన్ భగీరథ పనులు పూర్తయితే అక్కడి రిజర్వాయర్లకు అవుట్‌లెట్ల నుంచి అనుసంధానం చేయడం వల్ల నీటి సరఫరా జరుగుతుంది. నిధుల కొరత కారణంగా మిషన్ భగీరథ పథకం పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో ప్రజలకు సరిపడ మంచినీరు అందడంలేదు. పుర ప్రజలకు నిత్యం రక్షిత తాగునీరు అందించేందుకు మంచిర్యాలలోని అండాళమ్మ కాలనీ సమీపంలో గల జాలగుట్టవద్ద రూ.53 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టగా అవికూడా అర్థాంతరంగా నిలిచిపోయాయి. పట్టణంలో ప్రస్తుతం ప్రతిరోజు 7 ఎంఎల్‌డీ నీటిని రోజు విడిచి రోజు సరఫరా చేస్తున్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా మరో 10 ఎంఎల్‌డీ నీరు అదనంగా అందనుండగా నిత్యం సరఫరా చేసే వీలుంటుంది.

# రైల్వే క్రాసింగ్‌లు, రోడ్ల మలుపులు

### మిషన్ భగీరథకు ప్రధాన అడ్డంకులు

### చురుకుగా సాగుతున్నా తప్పని తిప్పలు

ఖమ్మం,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఇంటింటికి తాగునీరు అందించేందుకు చేపట్టిన మిషన్ భగీరథ పనుల్లో జాప్యం జరుగుతోంది. నకాలంలో పనులు పూర్తికాకపోవడంతో మొదటిదశలో నిర్దేశిరచిన సమయానికి తాగునీరు సరఫరా చేసే అవకాశం లేకుండాపోయింది. పాలేరు, వైరా, గోదావరి నీటివనరుల నుంచి ఆయా గ్రామాల వరకు పైపులైన్ల పనులు పూర్తవుతున్నప్పటికి అక్కడి నుంచి తాగునీటిని అందించే వనరులు ఇంకా అందించాలంటే ఇంట్రావిలేజ్ నిధులతోనే చేయాల్సి ఉంది. మిషన్ భగీరథ పనుల్లో అధికారులకు రైల్వేక్రాసింగ్‌లు, జాతీయ, రాష్ట్రీయ రహదారి వద్ద పైపులైన్లను దాటించడం కష్టంగా మారింది. ఇలా రెండు జిల్లాల్లో సుమారు 35 వరకు రైల్వేక్రాసింగ్‌లున్నాయి. మరో ప్రధాన ఇబ్బందికర పనుల్లో జాతీయం, రాష్ట్ర రహదారి మార్గాలను దాటుతూ వేయాల్సిన పనులు కూడా ఈ కోవలేనే ఉన్నాయి. ఇలా ఖమ్మం నుంచి సత్తుపల్లి వరకు సుమారు 18 చోట్ల రోడ్డుదాటించేలా పనులు చేపట్టారు. ఇంకా పూర్తిచేయాల్సి ఉంది. పాలేరు గ్రిడ్ పరిధిలో ఖమ్మం కార్పొరేషన్, చింతకాని, ధంసలాపురం వద్ద మొత్తం 6 రైల్వేక్రాసింగ్‌ల వద్ద భగీరథ తాగునీటి ప్రధాన పైపులైన్లను వేయాల్సి ఉంది. వైరా గ్రిడ్ పరిధిలో బోనకల్లు, మధిర, ఎర్రుపాలెం వద్ద మూడు రైల్వే క్రాసింగ్‌లున్నాయి. ఈ రెండు గ్రిడ్ల పరిధిలో మొత్తం తొమ్మిది క్రాసింగ్‌లు ఉండగా నాలుగు పనులు జరుగుతున్నాయి.

భద్రాద్రి జిల్లా పరిధిలో మణుగూరు, పినపాక వద్ద ఆరు రైల్వేక్రాసింగ్‌లు ఉండగా కొత్తగూడెం నుంచి డోర్నకల్లు మార్గంలో 20 వరకు ఉన్నాయి. అత్యధికంగా కారేపల్లి మండలంలో ఏడు రైల్వేక్రాసింగ్ పనులు జరగాల్సి ఉంది. ఈ పనులు మరింత ఇబ్బందికరంగా ఉన్నాయి.రెండోదశలో

తాగునీరు అందించాల్సి ఉన్న పనులకు సంబంధించి ఇవి ముడిపడి ఉన్నాయి. వీటికితోడు వైరా గ్రిడ్ పరిధిలో అటవీ అనుమతులు రావడం ఆలస్యం కావడం మరో కారణంగా కూడా ఉందని చెప్పొచ్చు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మిషన్ భగీరథ కింద ఇంటింటికి తాగునీటిని అందించేందుకు రూ. 3,600 కోట్లు కేటాయించారు. ఖమ్మం జిల్లాలో వైరా, పాలేరులను గ్రిడ్లుగా విభజించి ఇక్కడి నుంచి తాగునీరు అందించేందుకు కసరత్తు చేస్తున్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో అశ్వాపురం, దుమ్ముగూడెం కేంద్రంగా గోదావరి సెగ్మెంట్‌ను గ్రిడ్‌గా ఏర్పాటు చేశారు. ఉభయ జిల్లాల్లోని మూడు గ్రిడ్లకు మొదటిదశ భగీరథ పనులు చేపట్టేందుకు రూ.483 కోట్లు కేటాయించారు. డిసెంబర్ ఆఖరుకు ఒక్కో గ్రిడ్ పరిధిలో కొన్ని గ్రామాలకైనా తాగు నీటిని అందించాలనే లక్ష్యంలో ఉరుకులు పరుగులు తీసినా కుదరని పరిస్థితి నెలకొంది. వేసవి నాటికైనా పనులు వేగంగా చేసి కొన్ని గ్రామాలకు తాగునీరివ్వాలని ప్రయత్నిస్తున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితులు అనుకూలించడంలేదు. ప్రతి గ్రామంలో అంతర్గత పైపులైన్లు, నూతన ట్యాంకులు నిర్మించడంతోపాటు ప్రతి బజారుకు అవసరమైన స్థాయిలో పైపులైన్ నిర్మించాల్సి ఉంది. ఈ తరహాలో ఇంట్రావిలేజెస్ పనులకు అవసరమైన ప్రతిపాదనలను క్షుణ్ణంగా ప్రతిపాదించారు. గ్రిడ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో వీటిని రూపొందించారు. ఈ పనులు పూర్తి చేసేందుకు ఇంకా ఎక్కువ సమయం కావాల్సి వస్తుందని అధికారులు పేర్కొంటున్నారు.

## అద్భుతాలు సాధించని మోడీ నిర్ణయాలు

### పేద,మధ్యతరగతిలో తీవ్ర నిరసనలు

### బడ్జెట్ అంకెల గారడీతో దక్కని ఉపశమనం

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): గత ఆరేళ్లలో మోదీ సర్కార్ సాధించిన అభివృద్ధిపై ఇప్పటికే చాలా చర్చ జరిగింది. స్మార్ట్ సిటీలనుంచి మేక్ ఇన్ ఇండియాలవరకూ, అవినీతి నుంచి నల్లధనం నిర్మూలన వరకూ, అచ్చేదిన్ నుంచి సబ్ కా సాథ్ సబ్ కా వికాస్ వంటి నినాదాల వరకూ మోదీ అద్భుత ఫలితాలు సాధించి పరిస్థితి మరోలా ఉండేది. అయినా ఆయన రెండోసారి విజయంసాధించడంతో ఇవన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి భారీ ఎత్తున విజయం సాధించడం..అది కూడా గతంలో కన్నా ఎక్కువ సీట్లు సాధించిడంతో ఇక మోదీ ద్వయానికి బిజెపిలో తిరుగు లేదని నిరూపితం అయ్యింది. విపక్షపార్టీలన్నీ జతకట్టి ముందుకు సాగుతున్నా ప్రజలు వారిపట్ల విశ్వాసం చూపలేదు. అధికారం కోసం వారు జట్టుకట్టారన్నది ప్రజలకు తెలిసిపోయింది. మోదీ స్థానంలో బిజెపి నుంచి వివిధ పక్షాలు ఆమోదించగలిగిన మరో ప్రత్యామ్నాయ నేత రంగంలోకి వస్తారనే ఆశ కూడా లేదు. మోదీ తరవాత అమిత్‌షానే అన్నంతగా ఇప్పుడు పరిస్థితి ఏర్పడింది. మోదీ వైఖరి, స్వభావం, మొండితనం వల్ల ప్రతిపక్షాలే కాదు, స్వపక్షాలు కూడా ఆయనను వ్యక్తిగతంగా తీవ్ర స్థాయిలో వ్యతిరేకించే పరిస్థితి ఏర్పడిన దాఖలాలను కాదనలేం. మోదీ తీసుకున్న నోట్లరద్దు, జీఎస్టీ నిర్ణయాల వల్ల కలిగిన దుష్పరిణామాలను ప్రజలు అనుభవిస్తుంటే దాంతో దేశానికి మేలు జరిగిందని ఇంకా ప్రచారం చేసుకుంటున్నారు. ఇది కూడా ప్రజల్లోనే కాకుండా స్వపక్షంలోనూ వ్యతిరేకత వస్తోంది. గడ్కరీ లాంటి వారు నర్మగర్భంగా విమర్శలు చేసినా ఇప్పుడు కుక్కిన పేనులా పడివుండాల్సిన వైచిత్రి ఏర్పడింది. 1999లో కార్గిల్‌లో పాక్ చొరబాటు జరిగి, సైన్యం ఆ చొరబాటును తిప్పిగొట్టిన అనంతరం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ 303 సీట్లు గెలిచి అధికారంలోకి రాగలిగింది. ఆ తరవాత కశ్మీర్‌లో హింసాకాండ రగిలిపోయింది. అటు సైనిక చర్యలు ఎంత తీవ్రంగా జరిగాయో అంతే తీవ్ర స్థాయిలో ఉగ్రవాద చర్యలూ జరిగాయి. సర్జికల్ దాడులు, హిజ్బుల్ ముజాహిదీన్ కమాండర్ బుర్హాన్ వానీ కాల్చివేత, రాళ్లు విసిరిన వారిపై పెల్లెట్ల దాడి మొదలైన ఘటనలు ఒకవైపు, యూరిలో భద్రతాదళాలపై దాడి, పఠాన్ కోట్‌లో వైమానిక స్థావరంపై దాడి, అమర్‌నాథ్ యాత్రపై దాడి, సీనియర్ సంపాదకుడు బుఖారీ హత్య, చివరకు పుల్వామా దాడి వంటి ఘటనలు మోదీ నాయకత్వాన్ని బలోపేతం చేశాయి. జైషే మహమ్మద్, లష్కర్ ఏ తోయిబా సంస్థలకు పాక్ నుంచి ప్రోద్బలం అందుతూనే ఉన్నది. ముఖ్యంగా ప్రభుత్వానికీ, కశ్మీర్ ప్రజలకూ మధ్య గతంలో ఎన్నడూ లేనంతగా దూరం పెరిగింది. ఉగ్రవాదులకు ప్రజల మద్దతు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నది. మిగతా ప్రభుత్వాల హయాంతో పోలిస్తే మోదీ హయాంలో జరిగిన హింసాత్మక ఘటనలు, మరణించిన భద్రతా దళాల సంఖ్య ఎక్కువ. కశ్మీరీ సమస్యను పరిష్కరించే విషయంలో ఇతర ప్రధానమంత్రులు ఎదుర్కొన్న వైఫల్యాల కంటే మోదీమరింత విమర్శలు ఎక్కువగా ఎదుర్కొన్నారు. ఈ దశలో 370 ఆర్టికల్ రద్దు..కాశ్మీర్ నుంచి లద్దాక్ విభజన వంటి చర్యలతో పరిష్కారానికి పెద్దెత్తు కృషి జరుగుతోంది. అంతర్జాతీయంగా ఉగ్రవాదాన్ని ఖండించేందుకు అన్ని దేశాలు ముందుకు వస్తాయి కాని పాకిస్థాన్‌తో యుద్ధం చేయాల్సి వస్తే ఎన్ని దేశాలు భారత్‌కు అండగా నిలుస్తాయో ముందు తేల్చుకోవాల్సి ఉన్నది. దీనికి ఏ విధంగా ముగింపు పలుకుతారని ప్రజలు కూడా ఎదురు చూస్తున్నారు. మొత్తంగా ఇప్పుడు ప్రజలు జాతీయ అంశాలపై నింపాదిగా ఉన్నా..ఆర్థిక అంశాల కారణంగా అసంతృప్తిగా ఉన్నారు. సామాన్యులకు ఆర్థికంగా ఇబ్బంది కలుగుతోంది. కొత్తగా ఉద్యోగాల సృష్టి జరగడం లేదు. అలాగే నిరుద్యోగ సమస్య తీవ్రంగా మారింది.

ఉపాధి కనుచూపుమేరలో కానరావడం లేదు. బడ్జెట్ అంకెలగారడీగా మారింది. ఈ సమస్యలపై దృష్టి పెట్టాల్సిన తక్షణ ఆవశ్యకత మోడీ ప్రభుత్వంపై ఉంది.

## ఏపీలో ఈఎస్ఐ కుంభకోణం

### -రూ.900కోట్ల అక్రమాలు జరిగినట్లు విజిలెన్సు నివేదిక

విజయవాడ,ఫిబ్రవరి 21(ఆర్ఎన్ఎ) : తెలంగాణ తరహాలో ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఈఎస్ఐలో భారీ కుంభకోణం వెలుగులోకి వచ్చింది. గత ఆరేళ్లుగా ఈఎస్ఐలో పెద్ద ఎత్తున కుంభకోణం జరిగినట్లు విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గుర్తించారు. కొనుగోళ్లలో రూ.900 కోట్లకు పైగా భారీ అక్రమాలు జరిగినట్లు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఓ నివేదికను విడుదల చేసింది. ఆరేళ్లుగా కోట్ల రూపాయల ప్రభుత్వ నిధులను స్వాహా చేసినట్లు విజిలెన్స్ అధికారులు పేర్కొన్నారు. నకిలీ కొటేషన్లు సృష్టించి రేట్ కాంట్రాక్టులో లేని సంస్థలనుంచి మందులు కొనుగోలు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వం రూ. 89 కోట్లు చెల్లిస్తే, అందులో రేట్ కాంట్రాక్ట్ లో ఉన్న సంస్థలకు 38 కోట్లు చెల్లించినట్లు గుర్తించారు. మిగతా రూ. 51 కోట్లను దారి మళ్లించి రేట్ కాంట్రాక్ట్ లేని సంస్థలకు వాస్తవ ధర కంటే 132 శాతం అధనంగా అమ్మినట్లు ఆరోపణలు వచ్చాయి.

తెలంగాణ ఈఎస్ఐ స్కాంలో ముఖ్యపాత్ర పోషించిన సరఫరాదారులే ఈ స్కాంలో కూడా ఉన్నట్లు తేలింది. అప్పటి డైరెక్టర్లు రవి కుమార్, రమేష్ కుమార్, విజయ్ కుమార్ లోపాటు, ఆరుగురు జాయింట్ డైరెక్టర్లు, ఫార్మసిస్టులు, సీనియర్ అసిస్టెంట్లు ముఖ్యపాత్ర పోషించారని అధికారులు వెల్లడించారు. వీరితో పాటు అప్పటి కార్మిక శాఖ మంత్రి అచ్చెన్నాయుడు పాత్రపై కూడా అధికారులు ఆరా తీస్తున్నారు. తన వాళ్లకు చెందిన టెలీ హెల్త్ సర్వీసెస్ కంపెనీకి కాంట్రాక్ట్ అప్పగించాలని ఈఎస్ఐ డైరెక్టర్లకు లేఖ రాసినట్లు తెలిసింది. మంత్రి చొరవతోనే సదరు డైరెక్టర్లు రూ. 975 కోట్ల మందుల కొనుగోలు చేసి, అందులో 100 కోట్లకు పైగా నకిలీ బిల్లులను సృష్టించినట్లు ఆరోపణలున్నాయి. అయితే మందుల కొనుగోలుకు ప్రభుత్వం రూ. 293 కోట్ల బ్జడెట్ కేటాయిస్తే, 698 కోట్ల రూపాయలకు మందులను కొనుగోలు చేసినట్లు ప్రభుత్వానికి చూపి ఖజానాకు 404 కోట్ల రూపాయలు నష్టం కలిగించారు. ఈఎస్ఐ స్కాంకు పాల్పడిన లెజెండ్ ఎంటర్ ప్రైజెస్, ఓమ్ని మెడీ, ఎన్వెంటర్ పర్ఫామెన్స్ సంస్థలకు సదరు డైరక్టర్లు లాబ్ కిట్ల కొనుగోలు పేరుతో 85 కోట్లు చెల్లించారు. 2018-19 సంవత్సరానికి 18 కోట్ల విలువైన మందులు కొనుగోలు చేసినట్లు రికార్డుల్లో ఉంటే , అందులో కేవలం రూ. 8 కోట్లు మాత్రమే వాస్తవ ధరగా ప్రకటించి మిగతా నిధులు స్వాహా చేశారు. అంతేగాక మందుల కొనుగోలు, ల్యాబ్ కిట్లు ,ఫర్నిచర్, ఈసీజీ సర్వీసులు బయోమెట్రిక్ యంత్రాల కొనుగోలు లో భారీగా అక్రమాలు జరిగినట్టుగా కూడా గుర్తించారు. వాస్తవానికి ఒక్కో బయోమెట్రిక్ మిషన్ ధర రూ.16,000 అయితే ఏకంగా రూ. 70 వేల చొప్పున నకిలీ ఇండెంట్లు సృష్టించి అక్రమాలకు పాల్పడినట్లు నివేదికలో తేలింది.

## మార్చినుంచి మిషన్ భగీరథ తాగునీరు -చకచకా సాగుతున్న పనులు

మెదక్,ఫిబ్రవరి22(నేటినిజం ప్రతినిధి): వేసవిలో గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. మార్చి మొదటి వారం నుంచి గ్రామాలకు మిషన్ భగీరథ నీరు అందించేందుకు ట్రయల్‌రన్ పనులు జరుగుతున్నాయి. సింగూర్ ప్రాజెక్టు నుంచి అందోల్, నారాయణఖేడ్, మెదక్ నియోజకవర్గంలోని 874 గ్రామాలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాను చేయడం జరుగుతుందని మిషన్ భగీరథ ఏఈ రవికుమార్ తెలిపారు. సింగూర్ ప్రాజెక్టులో 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉందని ఆరు నెలలు సరిపడే నీరు ఉందని పేర్కొన్నారు. ఇప్పటికే మిషన్ భగీరథ ట్రయల్‌రన్ చేయడం జరిగిందని తెలిపారు. కొన్ని గ్రామాల్లో ట్యాంకుల కనెక్షన్లు ఇవ్వాల్సి ఉందని, పనులు కూడా జరుగుతున్నాయని పేర్కొన్నారు. అందోల్ నియోజకవర్గంలోని రేగోడు, అల్లాదుర్గం, టేక్మాల్, జోగిపేట్, పుల్కల్ మండలాలు, మెదక్, నారాయణఖేడ్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో మిషన్ భగీరథ పథకం తాగునీటి సరఫరాను మార్చి ఒకటో తేదీ నుంచి పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. తాగునీటిని రెండు రోజులకు ఒకసారి మాత్రమే పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. రేగోడు మండలంలో తాగునీటి సమస్య వర్షకాలంలో తీవ్రంగా ఉంది. మండలంలోని సిందోల్, టీలింగంపల్లి, రేగోడు తాటిపల్లి, ప్యారారం, తిమ్మాపూర్, వెంకటాపూర్, పోచారం, కొండాపూర్, పెద్దతండా, సంగమేశ్వర్ తండాలో ట్యాంకర్లు, ప్రైవేట్ వ్యవసాయ బోర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. వర్షాకాలంలోనూ ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేశారు. కొన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు అసంపూర్తిగా నిలిపోయాయి. మార్చి నుంచి మిషన్ భగీరథ తాగునీటి సరఫరా చేస్తే సమస్య తీరనుందని మండల ప్రజలు ఆనందరం వ్యక్తం చేస్తున్నారు.

# నీటి కోసం నడుం కట్టిన గిరిజనం

## శ్రమదానంతో పాటు..డబ్బుల సాయం

## మంచినీటి సమస్యను దూరం చేసుకున్న అడవిపుత్రులు

విశాఖపట్నం,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): బస్కి దేవరాపల్లి.... అరకులోయ మండలంలో మారుమూలన వున్న గిరిజన గ్రామం. అరకులోయ, అనంతగిరి మండలాల సరిహద్దులో బస్కి పంచాయతీ శివారున బస్కి దేవరాపల్లి గిరిజన గ్రామం వుంది. మూడు వీధులు, 300 నివాసాలు, 1200 మంది జనాభా వున్నారు. మూడేళ్ల క్రితం రూ.12 లక్షలు ఖర్చు చేసి తాగునీటి పథకాన్ని ఏర్పాటు చేశారు. కానీ ప్రణాళిక లోపం, పనుల్లో నాణ్యత కొరవడడంతో కొద్ది రోజులకే మూలకు చేరింది. అప్పటి నుంచి కలుషితమైన ఊట నీరే వారికి ఆధారమైంది. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో ఏడాది క్రితం రెండు వీధులకు చెందిన వారు ఇంటికి రూ.10 వేల వంతున చందాలు వేసుకుని, శ్రమదానం తో రెండు కి.మీ. మేర పైప్‌లైన్‌ను వేసుకొని నీటి సమస్యను పరిష్కరించుకున్నారు. మూడేళ్ల క్రితం లక్షల రూపాయలు వ్యయం చేసిన నిర్మించిన మంచినీటి పథకం... అధికారుల అనాలోచిత నిర్ణయం, పనుల్లో నాణ్యతలోపంతో మూన్నాళ్ల ముచ్చగా మారింది. తాగునీటి కోసం గిరిజనులు ఊటనీటిపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వర్షాకాలంలో కలుషిత నీటివల్ల, వేసవిలో ఊటలు అందుగంటుతుండడంతో ఇబ్బంది పడుతున్నారు. తమ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. దీంతో సమస్యను తామే పరిష్కరించుకోవాలని నిర్ణయించుకున్నారు. మట్టి పనులు శ్రమదానంతో చేయాలని, తాగునీటి సరఫరాకు అవసరమైన పైపులు, ట్యాంకు, ఇతర సామగ్రి కొనుగోలుకు ప్రతి కుటుంబం రూ.15 వేల చొప్పున చందా ఇవ్వాలని తీర్మానించారు. 30 కుటుంబాల వారు రూ.4.5 లక్షలు సమకూర్చుకుని ఇటీవల పనులు ప్రారంభించారు. ప్రస్తుతం శరవేగంగా పనులు జరుగు తున్నాయి. కొద్ది రోజుల్లో పనులు పూర్తిచేసి, తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కంచుకుంటామని గ్రామ గిరిజనులు ఆత్మస్థైర్యంతో చెబుతున్నారు.

మూడో వీధిలో నివాసం వుంటున్నవారు తమకు కూడా నీటిని సరఫరా చేయాలని కోరారు. వాళ్లు వీలుకాదని చెప్పడంతో తాము కూడా నిధులు సమకూర్చుకుని సొంత పైప్‌లైన్ ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇంటికి రూ.15 వేల చొప్పున చంద వేసుకోవాలని తీర్మానించారు. 30 కుటుంబాల నుంచి రూ.4.5 లక్షలు పోగుచేశారు. 2,000 మీటర్ల హెచ్‌డీ పైపులు, 2,000 లీటర్ల సామర్థ్యం వున్న సింటెక్స్ ట్యాంకు, ఇతర పరికరాలు కొనుగోలు చేశారు. పది రోజుల క్రితం పైప్‌లైన్ ఏర్పాటు పనులు ప్రారంభించారు. ప్రతి ఇంటిలో పురుషులు, మహిళలు శ్రమదానం చేయాలని నిర్ణయించుకున్నారు. గ్రామానికి ఎగువన రెండు కిలోమీటర్ల దూరంలో అనంతగిరి మండలం కాకరపాడు సమీపంలో ఉన్న లేంజ్‌పొదజోరు నుంచి గ్రామం వరకు పైప్‌లైన్ ఏర్పాటు పనులు చేపట్టారు. పైప్‌లైన్ వేయడానికి గొయ్యి తవ్వుతున్నారు. మధ్యలో పెద్దపెద్ద బండరాళ్లు, తుప్పలు తొలగించాల్సి వస్తున్నది. అయినా వెనకడుగు వేయకుండా కాలువ తవ్వుతున్నారు. బుధవారంనాటికి సుమారు కిలోమీటరు మేర పైప్‌లైన్ వేశారు. గ్రావిటీ ద్వారా నీటి సరఫరా ఎలా వుందో పరిశీలించారు. అనుకున్న విధంగా నీరు వస్తుండడంతో సంతోషాన్ని వ్యక్తం చేశారు. వీరి ప్రణాళిక కారణంగా మండు వేసవిలోనూ నీటి ఎద్దడి ఉండదని అంటున్నారు. ఐటీడీఏ పీఓ బస్కి దేవరాపల్లిని సందర్శించాలి. తాగునీటి కోసం గిరిజనులు సొంత సొమ్మును సమకూర్చుకుని, శ్రమదానంతో చేస్తున్న పనులను పరిశీలించాలి. ఇదే సమయంలో గతంలో నిర్మించి, నిరుపయోగంగా వున్న తాగునీటి పథకాన్ని కూడా చూడాలి. కొద్ది రోజులకే ఎందుకు మూలకు చేరిందో తెలుసుకోవాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. శ్రమదానంలో పైప్‌లైన్ వేసుకుంట్ను గ్రామస్థుల చొరవను మెచ్చుకుని, తాగునీటి కోసం ఖర్చు చేస్తున్న డబ్బులను గిరిజనులకు తిరిగి చెల్లించాలి. ఇంతకాలం గ్రామానికి సమీపంలో పొలాల వద్ద ఊటనీరే ఆధారమైంది. కలుషితమైన ఈ నీటివల్ల వ్యాధులబారిన పడుతున్నారు. దీంతో మేమంతా కలిసి చందాలు వేసుకుని, తాగునీటి పథకం పనులు చేపట్టాం. మండు వేసవిలో కూడా నీటి సమస్య ఉండదన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య గురించి పలుమార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోలేదు. గతంలో జన్మభూమి కార్యక్రమానికి వచ్చిన అధికారులకు ఖాళీబిందెలతో నిరసన తెలియజేశాం. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మరోమారు అధికారులను కలిసి తాగునీటి సమస్య గురించి చెప్పాం. అయినా స్పందన లేకపోవడంతో కార్యరంగంలోకి దిగామని అన్నారు. తాగునీటి కోసం పొలాల్లో ఊటలపై ఆధార పడడంతో .. ఈ నీటిని తాగితే వర్షాకాలంలో జ్వరాలు వస్తున్నాయి. వేసవిలో నీటి కోసం చాలా ఇబ్బంది పడుతున్నాం. ఈ సమస్యను మేమే పరిష్కరించుకోవాలని అనుకున్నామని పలువురు వెల్లడించారు.

# ఇళ్ల పట్టాల కోసం ఇష్టారాజ్యంగా భూ సేకరణ

## కొండగట్టులు..స్మశానాలు వదలడం లేదు

## ప్రజల్లో తీవ్ర నిరసన.. కోర్టు తలుపులు తట్టిన రైతులు

చిత్తూరు,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): జిల్లాలో పేదలకు ఇళ్ళ పట్టాలిచ్చే పేరిట అధికార యంత్రాంగం భూసేకరణలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు ఉన్నాయి. నిబంధనలకు విరుద్దంగా పొలాలను, స్మశానవాటికలను సైతం కూల్చేస్తోంది. పలుచోట్ల పేదలకు గతంలో ఇచ్చిన వ్యవసాయ భూములను ఇళ్ళ స్థలాల కోసం తిరిగి స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో కొన్ని గ్రామాల్లో ప్రజలు కోర్టుకు వెళ్లి అడ్డుకున్నారు. కొండ ప్రాంతాలను సైతం స్వాధీనం చేసుకోవడంతో పర్యావరణ విధ్వంసం జరుగుతుందని భావిస్తున్నారు. ఆ క్రమంలో నిబంధనలు పాటించడం లేదు. పేదల సౌకర్యాన్నీ పట్టించుకోవడం లేదు. అటవీ భూములను, కొండ గుట్టలను, నీటి కుంటలను లే అవుట్లుగా మార్చేస్తుండడం ద్వారా పర్యావరణ పరిరక్షణను గాలికొదిలేస్తున్నారు. పేదలకు ఇళ్ళ స్థలాలివ్వడానికి అవసరమైన 2291 ఎకరాల భూమి కావాల్సి వుండగా ఇప్పటివరకూ 1927 ఎకరాలు గుర్తించారు.ఈ భూములు 1146 ప్రాంతాల్లో విస్తరించి వున్నాయి. వీటిలో ఐదువందలకు పైగా ప్రాంతాలు కొండగుట్టలే అని తెలుస్తోంది. . వీటిని కనుమరుగు చేస్తుండడంతో పర్యావరణ విధ్వంసం సాగుతోంది. తిరుపతి నగరంలోని పేదలకు ఇళ్ళ స్థలాలిచ్చేందుకు రెవిన్యూ అధికారులుమంగళంలోని అటవీ శాఖ భూములపై పడ్డారు. 50 ఎకరాల భూమిని ఆ శాఖకు ముందస్తు సమాచారం కూడా ఇవ్వకుండా స్వాధీనం చేసుకున్నారు. రికార్డుల్లో భూమి తమ శాఖ పేరిట వుందని అధికారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నా ఎవరూ వినిపించుకోవడం లేదు. ఆ భూమిలో ఎర్రచందనం సహా విలువైన ఇతర వృక్షాలెన్నో వున్నాయి. ఇపుడు వాటితో పాటు ఆ భూమి భవితవ్యం అధికార పార్టీ నేతల చేతుల్లో వుంది. మరోవైపు భూముల చదును పేరిట కోట్లల్లో ప్రజా ధనం దుర్వినియోగం జరుగుతోందన్న విమర్శలూ వస్తున్నాయి. పుంగనూరు మండలం చదళ్ళ గ్రామంలో పేదలకు ఇళ్ళ పట్టాలిచ్చేందుకు 2.42 ఎకరాల ప్రభుత్వ భూమిని గుర్తించారు. ఆ భూమిని గ్రామస్తులు చెత్త దిబ్బలు వేసేందుకు తరతరాలుగా వాడుతున్నారు. ఇళ్ళస్థలాలకు ఆ భూమిని ఇచ్చేది లేదని ఊరి జనం అభ్యంతరం వ్యక్తం చేశారు. పోలీసుల సాయంతో రెవిన్యూ అధికారులు యంత్రాలు వినియోగించి చదును చేశారు. పట్టు వదలని గ్రామస్తులు ఆందోళనకు దిగడంతో దాన్ని వదలిపెట్టిన అధికారులు గ్రామంలోని నీటి ఆధారమైన చదళ్ళ కుంటకు ఎసరు పెట్టారు. కుంటను చదును చేసి ఇళ్ళ స్థలాలిచ్చేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. గుర్రంకొండలో 315మందికి ఇళ్ళ స్థలాల కోసం ఐదెకరాల భూమిని గుర్తించారు. ఇందులో రైతుల కుటుంబాలు గత 40 ఏళ్ళుగా పంటలు సాగు చేసుకుంటున్నాయి. వ్యవసాయ బోరు బావులే కాదు చివరికి వారి కుటుంబీకుల సమాధులు కూడా ఆ భూమిలో వున్నాయి. వారికి కనీస సమాచారం కూడా ఇవ్వకుండా నే రెవిన్యూ అధికారులు భూమిని చదును చేసేశారు. కడుపు మండిన రైతుల కుటుంబాలు తమ భూమిని దక్కించుకునేందుకు హైకోర్టు తలుపు తట్టాల్సి వచ్చింది. కోర్టు ఆదేశాలతో తాత్కాలికంగా వారి భూములు లే అవుట్లు కాకుండా ఆగాయి. పూతలపట్టు మండలం ఎగువ పాలకూరులో స్కూలు ఆట స్థలాన్ని రెవిన్యూ అధికారులు పేదలకు ఇళ్ళ స్థలాల కోసం ఎంపిక చేశారు. అధికారులు భూమిని చదును చేసి పట్టాలిచ్చేందుకు సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న వారు లేరు. వి.కోట మండలం బోయచిన్నాగనపల్లె పంచాయతీ లింగాపురంలో జడ్పీ హైస్కూలు ఆటస్థలంలో ఇళ్ళ స్థలాలకు లే అవుట్ వేశారు. మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ పరిధిలోవలసపల్లె పంచాయతీలో పదెకరాలు గుర్తించారు. ఆ భూమిలో వలసపల్లెవాసుల సమాధులు ఉన్నాయి. వాటిని మినహాయించి మిగిలిన భూమిని లే అవుట్ గా మార్చేశారు. కొత్తపల్లె పేదలకు ప్రతిపాదిత ఇళ్ళస్థలాల దూరం కేవలం ఆరు కిలోమీటర్లు మాత్రమే. ఉన్న ఊరిని, పంట పొలాలను విడిచిపెట్టి అంతదూరం పోవడానికి లబ్ధిదారులు ససేమిరా అంటున్నారు. ములకలచెరువు మండల కేంద్రంలోని పేదలకు ఇళ్ళ స్థలాల కోసం రెండున్నర కిలోమీటర్ల దూరంలో దండుదారిపల్లె గుట్టను చదును చేస్తున్నారు. ఆ ప్రాంతంలో ఇళ్ళ స్థలాలు తీసుకోవడానికి, ఇళ్ళు కట్టిస్తే నివాసముండడానికి లబ్ధిదారులు ఇష్టపడడం లేదు.

# ట్రంప్ రాకకోసం భారీ హంగామా

## గుజరాత్‌లో పెద్ద ఎత్తున ఏర్పాట్లు

## ద్వైపాక్షిక వ్యూహంతో వస్తోన్న ట్రంప్

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): భారతదేశ పర్యటనలో ట్రంప్ ద్విముఖ వ్యూహాన్ని అనుసరిస్తూ వ్యక్తిగత , అమెరికా వాణిజ్య ప్రయోజనాల కోసం ఆరాటపడుతున్నారు. ట్రంప్ భారత పర్యటన ఒక విధంగా ఆయన ఎన్నికల ప్రచారంలో ఒక భాగం కానుంది. అమెరికా అధ్యక్ష ఎన్నికలు మరో తొమ్మిది నెలల్లో రాబోతుండగా జరుగనున్న ఈ పర్యటన ద్వారా ట్రంప్ గరిష్ఠ ప్రయోజనాన్ని ఆశిస్తున్నారు. అమెరికాలోని భారత ఎన్ఆర్ఐల ఆదరణ పొంది వారి ఓట్లను గంప గుత్తగా సంపాదించడానికి భారత్ పర్యటన ఉపకరిస్తుందని ట్రంప్ భావిస్తున్నారు. అమెరికాలో ఎక్కువ సంఖ్యలో ఉన్న గుజరాతి సంతతి వారిని తనకు అనుకూలంగా మార్చుకోవడానికి అహ్మదాబాద్ పర్యటనను ఒక ఎత్తుగడగా ఎంచుకున్నారు. అమెరికాలోని గుజరాతీయులను కూడా అహ్మదాబాద్‌లో జరిగే నమస్తే ప్రెసిడెంట్ ట్రంప్ కార్యక్రమానికి ఆహ్వానిస్తున్నారు. దీని ద్వారా భారత ప్రధాని మోడీ తనకు ఆప్తమిత్రుడని చాటి వారి అభిమానాన్ని చూరగొనడానికి ప్రయత్నిస్తున్నాడు. తొలిసారిగా భారతదేశానికి విచ్చేస్తున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ పర్యటన కోసం కేంద్ర ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. రెండు రోజుల పర్యటన కోసం ట్రంప్ ఈ నెల 24న తన సతీమణి మెలనియాతో కలిసి భారత్‌కు రానున్నారు. అమెరికా అధినేత తొలిరోజు గుజరాత్ రాష్ట్రంలో పర్యటించి మరుసటి రోజు ఢిల్లీలో ద్వైపాక్షిక వాణిజ్య చర్యలు మోడీతో జరుపుతారు. ఫిబ్రవరి 24న అహ్మదాబాద్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో కలిసి ట్రంప్ రోడ్ షోలో పాల్గొంటున్నారు. అహ్మదాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్ట్ నుంచి సబర్మతి ఆశ్రమం వరకు ప్రయాణించి మహాత్మాగాంధీకి నివాళులు అర్పించనున్నారు. తదనంతరం మోతేరా స్టేడియం వరకు మొత్తం 22 కిలోమీటర్ల మేర రోడ్ షో సాగుతుంది. అహ్మదాబాద్‌లో మోతేరా ప్రాంతంలో నూతనంగా నిర్మించిన ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ స్టేడియమైన సర్దార్ వల్లబాయ్ పటేల్ స్టేడియాన్ని ట్రంప్, మోడీలు కలిసి ఆవిష్కరిస్తారు. అనంతరం లక్ష మందితో కొనసాగే సభలో ఇరువురు నాయకులు భారతీయులను ఉద్దేశించి మాట్లాడనున్నారు. లక్షలాది మందితో భారతదేశంలో తనకు ఘన స్వాగతం లభించబోతున్నదని ట్రంప్ గొప్పగా చెప్పుకుంటున్నారు. మోడీ తనకు మంచి మిత్రుడని, గ్రేట్ జెంటిల్‌మెన్ అని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. భారత దేశానికి వాణిజ్య ప్రయోజనాలు కల్పించే విషయంలో ట్రంప్ నిరాసక్తతనే ప్రదర్శిస్తున్నారు. ట్రంప్ రాక సందర్భంగా నిర్వహించనున్న మోగా ఈవెంట్ పేరును కేంద్రం నమస్తే ప్రెసిడెంట్ ట్రంప్‌గా మార్చింది. అంతకు ముందు ఈ కార్యక్రమానికి కెమ్ చో ట్రంప్ అనే పేరు పెట్టారు. గుజరాతిలో కెమ్ చో ట్రంప్ అంటే ఎలా ఉన్నారు ట్రంప్ అని అర్థం. జాతీయ విధానంలో భాగంగా కేంద్రం ఈ పేరును మార్పు చేసింది. అహ్మదాబాద్ విమానాశ్రయం నుండి ప్రారంభమయ్యే ట్రంప్, మోడీ రోడ్ షో సందర్భంగా ఈ మార్గాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. అహ్మదాబాద్‌లో ట్రంప్ 3 గంటల కార్యక్రమానికి గుజరాత్ ప్రభుత్వం దాదాపు రూ. 100 కోట్లు ఖర్చు చేస్తోంది. అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, అహ్మదాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ సంయుక్తంగా రహదారుల మరమ్మతులు, నగరంలో సుందరీకరణ కోసం కోట్ల రూపాయలను వెచ్చిస్తున్నాయి. అక్కడి మురికివాడలు ట్రంప్ కనపడకుండ చేసేందుకు వాటికి అడ్డంగా గోడను నిర్మిస్తున్నాయి. దాదాపు అర కిలోమీటరు పొడవు, ఏడడుగుల ఎత్తుతో గోడను కడుతున్నట్లు స్థానిక పత్రికలు కథనాలను ప్రచురిస్తున్నాయి. నాకు నువ్వు నీకు నేను అన్నట్లుగా ఇరు దేశాల అధినేతల మధ్య గత ఏడాదిన్నరగా అనుబంధం పెరిగిపోతోంది. ఒకరిపై ఒకరు ప్రశంసలు కురిపించుకుంటూ తమ తమ దేశాల ప్రజల్లో సానుకూల దృక్పథం తమ పట్ల పెంపొందేలా జాగ్రత్తలు వహిస్తూ తమ రాజకీయ భవిష్యత్తు దేదీప్యమానంగా ఉండేలా కృషి చేస్తున్నారు. మన దేశంలో సార్వత్రిక ఎన్నికలు జరగడానికి ముందు అమెరికాలోని హూస్టన్‌లో జరిగిన హౌడీ మోడీ సభలో 50,000 మంది భారత సంతతి వారిని ఉద్దేశించి ఇరువురు నేతలు ప్రసంగించడం జరిగింది. మోడీ అమెరికా పర్యటనను బిజెపి పెద్ద ఎత్తున ప్రచారం చేసుకొని ఎన్నికల్లో లబ్ధిపొందడం జరిగింది. ప్రస్తుతం ఇదే తరహాలో ట్రంప రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది. ట్రంప్ తన పర్యటన ద్వారా అతి పెద్ద మార్కెట్ అయిన భారత దేశంలో వ్యవసాయ, రక్షణ, ఇంధన, ఇంజినీరింగ్, పారిశ్రామిక, వైద్య రంగాల్లో అనేక ఉత్పత్తులకు సంబంధించిన ఒప్పందాలు కుదుర్చుకొని తద్వారా అమెరికాకు దండిగా ప్రయోజనం చేకూర్చానని ప్రచారం చేసుకోవడానికి ట్రంప్ ఉత్సాహపడుతున్నాడు.

# ట్రంప్ పర్యటన అంతా సొంత లాభానికేనా?

## వాణిజ్య ఒప్పందాలపై కానరాని స్పష్టత

## ఎగుమతి సుంకాలపై తొలగని అస్పష్టత

న్యూఢిల్లీ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భారత్ పర్యటనకు వస్తున్న సందర్భంగా...ఇద్దరు దేశాధినేతలు సంయుక్తంగా ఇరు దేశాల్లో సభలు పెడుతున్నప్పటికీ రెండు దేశాల మధ్య మాత్రం వాణిజ్య స్పర్ధలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. అమెరికాలోని పారిశ్రామిక వర్గాలు ఫిర్యాదు చేయడంతో భారతదేశాన్ని అభివృద్ధి చెందుతున్న దేశాల జాబితా నుంచి తొలగించి అభివృద్ధి చెందిన దేశాల జాబితాలో అమెరికా చేర్చింది. ఇండియాని అభివృద్ధి చెందిన జాబితాలోకి చేర్చడం వల్ల వాణిజ్య పరంగా రావాల్సిన అనేక ప్రయోజనాలు దక్కకుండాపోతాయి. ఫలితంగా భారతదేశం నుంచి ఎగుమతి కాబడే వస్తువులకు భారీ ఎత్తున సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మన ఎగుమతిదారులు ఇతర దేశాలతో పోటీ పడటం కష్టమవుతుంది. అమెరికాకు మన ఎగుమతులు పెద్ద ఎత్తున తగ్గిపోయే ప్రమాదం పొంచి ఉంది. అమెరికా పౌల్ట్రీ ఉత్పత్తుల దిగుమతులపై సుంకాలను భారతదేశం తగ్గించాలని ఒత్తిడి తెస్తోంది. బర్డ్‌ఫ్లూ వైరస్‌తో 2007లో అప్పటి మన్మోహన్ ప్రభుత్వం అమెరికా పౌల్ట్రీ ఉత్పత్తుల దిగుమతులపై నిషేధం విధించింది. దీనిపై అమెరికా ప్రపంచ వాణిజ్య సంస్థకు ఫిర్యాదు చేసింది. డబ్లుటిఓ ద్వారా అమెరికా ఒత్తిడి తేవడంతో 2017లో చికెన్ లెగ్స్ దిగుమతికి భారత్ అంగీకరించింది. అట్టి దిగుమతులపై 100 శాతం దిగుమతి సుంకాలను విధించింది. ప్రస్తుతం ఈ సుంకాన్ని 10 శాతానికి తగ్గించాలని అమెరికా పట్టుపడుతోంది. ఇదే జరిగితే అమెరికా నుంచి కారు చౌకగా కోడి మాంసం, గుడ్లు దిగుమతి అయితే దేశీయ మార్కెట్‌లో 40 శాతం వాటా కోల్పోవాల్సి వస్తుందని 2015లోనే వాణిజ్య మంత్రిత్వ శాఖ హెచ్చరించింది. ట్రంప్ పర్యటన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఉన్న పౌల్ట్రీ పరిశ్రమ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఉన్న దిగుమతి సుంకాలను తగ్గిస్తే అమెరికా లెగ్ పీసులు దేశీయ మార్కెట్‌ను ముంచెత్తి ఘోరంగా నష్టపోతామని కోళ్ల పరిశ్రమ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. దీని వల్ల లక్షలాది కోళ్ల ఫాంలు మూతపడి వాటిపై ఆధారపడిన వేలాది కుటుంబాలు ఉపాధి కోల్పోయి గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుంది. అదే విధంగా భారత డైరీ మార్కెట్‌లోకి అమెరికాను అనుమతింప చేయడానికి ట్రంప్ సర్కార్ ప్రయత్నిస్తోంది. భారత పాల మార్కెట్‌లోకి గనుక అమెరికాకు అనుమతిస్తే దాదాపు 15 కోట్ల మంది పాడి రైతుల జీవనం గందరగోళం లో పడే అవకాశాలున్నాయి. అమెరికా వ్యవసాయోత్పత్తులైన మొక్కజొన్న, పత్తి, సోయా, గోధుమ, ఆల్మండ్, వాల్‌నట్స్, బాదం, ఆపిల్ మొదలగు వాటికి సుంకాలు తగ్గించి తలుపులు బార్లా తెరిచినట్లయితే భారతీయ రైతుల పరిస్థితి అగమ్యగోచరమవుతుంది. ట్రంప్ పర్యటన వల్ల భారత్‌కు లాభం కలుగుతుందా? లేక అమెరికా వ్యాపారానికి ఉపయోగపడేలా ఉంటుందా అన్నది 25 తేదీ వరకు వేచిచూడాల్సిందే. ప్రస్తుత పరిస్థితులలో భారత్ అమెరికా మధ్యలో పూర్తి స్థాయిలో వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. పరిమిత స్థాయిలోనే వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం కనబడుతోంది. నిరుడు నవంబర్‌లో ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం సందర్భంగా రైతుల ప్రయోజనాలను కాపాడిన కేంద్ర ప్రభుత్వం అదే ఒరవడితో ట్రంప్‌తో జరిగే ద్వైపాక్షిక చర్చల్లో దేశీయ ప్రయోజనాలను పరిరక్షించే విధంగా కృషి చేయాలి.


# ఈసారి ఏపీ బడ్జెట్ సమావేశాలపై కసరత్తు

## స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో త్వరగా ముగించేలా ప్లాన్ ?

అమరావతి,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఎప్పుడు నిర్వహించాలనే దానిపై ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలు ఉండడంతో త్వరగా సమావేశాలు నిర్వహించి ముగించాలని చూస్తోంది. ఎట్టి పరిస్థితుల్లోనూ అసెంబ్లీ సమావేశాల కంటే ముందే ఎన్నికలు నిర్వహించి తీరాలని పట్టుదలగా ఉన్న వైసీపీ ప్రభుత్వానికి రిజర్వేషన్ల వ్యవహారం తలనొప్పులు తెచ్చిపెట్టింది. దీంతో హైకోర్టు రిజర్వేషన్లపై ఇచ్చే తీర్పు ఆధారంగానే స్థానిక ఎన్నికలతో పాటు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలపై స్పష్టత రానుంది. ఏపీలో మూడు రాజధానుల ప్రక్రియను సాధ్యమైనంత త్వరగా ముందుకు తీసుకెళ్లాలని భావిస్తున్న వైసీపీ ప్రభుత్వం ఈ ఏడాది జనవరిలోనే దీనికి సంబంధించిన కసరత్తును ప్రారంభించింది. అయితే అసెంబ్లీలో మూడు రాజధానులకు ఉద్దేశించిన కీలక బిల్లులు ఆమోదం పొందినా శాసనమండలిలో మాత్రం చుక్కెదురైంది. ఓవైపు బిల్లు సెలక్ట్ కమిటీకి వెళ్లాయో లేదో తెలియక సాధారణ జనం గందరగోళంలో మునిగిపోతే ప్రభుత్వం మాత్రం బిల్లులు ఆమోదం పొందాయని చెప్పుకుంటోంది. మండలి ఛైర్మన్ గవర్నర్‌కు చేసిన ఫిర్యాదుతో ఈ మొత్తం వ్యవహారం గవర్నర్ కోర్టులోకి వెళ్లినట్లయింది. అధికార విపక్షాల విమర్శనాస్త్రాల సంగతి ఎలా ఉన్నా కేంద్రంతో సీఎం జగన్ నెరుపుతున్న సంబంధాల పుణ్యమాని శాసనమండలి రద్దుకు అడుగులు వేగంగా పడుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. మార్చి 2న పార్లమెంటు తిరిగి ప్రారంభం కాగానే ఏపీ మండలి రద్దు బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించేలా కేంద్రం నుంచి జగన్‌కు హామీ లభించినట్లు ప్రచారం సాగుతోంది.కేంద్రం ఏపీ శాసనమండలి రద్దుకు ఆమోద ముద్ర వేస్తే మాత్రం మూడు రాజధానుల ప్రక్రియ జోరందుకోనుంది. దీన్ని దృష్టిలో ఉంచుకునే ఈ ఏడాది బడ్జెట్ సమావేశాల తేదీలను ఖరారు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆ లోపే స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పూర్తిచేసేందుకు ప్రభుత్వం శరవేగంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ సమావేశాల్లోనే పంచాయతీ రాజ్ చట్టం సవరణపై జారీ చేసిన ఆర్డినెన్స్ స్థానంలో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించనున్నారు. దీంతో పాటు కేంద్రం మండలి రద్దుపై నోటిఫికేషన్ జారీ చేస్తే మూడు రాజధానులపై తదుపరి పక్రియ కూడా మొదలు కానుంది. అప్పుడు మూడు రాజదానులపై అసెంబ్లీ వేదికగా వైసీపీ ప్రభుత్వం కీలక నిర్ణయాలు ప్రకటించే అవకాశముంది. ఇప్పటికే పంచాయతీ రాజ్ చట్టంలో సవరణలు చేయడంతో పాటు దీనికి సంబంధించిన ఆర్డినెన్స్‌ను కూడా ప్రభుత్వం జారీ చేసింది. దీంతో హైకోర్టు రిజర్వేషన్లపై తుదితీర్పు ఇచ్చిన వెంటనే స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ విడదల చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ నెలాఖరులోగా హైకోర్టు తీర్పు వస్తుందని ఆశిస్తున్న ప్రభుత్వం వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయడంతో పాటు శరవేగంగా స్థానిక ఎన్నికల పక్రియ పూర్తిచేయబోతోంది. అదే సమయంలో స్థానిక ఎన్నికల షెడ్యూల్‌ను బట్టి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తేదీలను కూడా ఖరారు చేయనుంది. స్థానిక ఎన్నికలపై హైకోర్టు తీర్పు ఆలస్యమైతే మాత్రం బడ్జెట్ సమావేశాలను మార్చి నెలాఖరుకు వాయిదా వేయనుంది. అదే జరిగితే ఈసారి వారం రోజుల్లోనే బడ్జెట్ సమావేశాలు పూర్తి చేయాల్సి ఉంటుంది. అలా కాకుండా స్థానిక సంస్థల రిజర్వేషన్ల వ్యవహారం హైకోర్టులో వాయిదా పడుతూ పోతే మాత్రం స్థానిక సంస్థల ఎన్నికలు మరింత ఆలస్యమవుతాయి. అదే జరిగితే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మాత్రం మార్చి మొదటి వారంలోనే నిర్వహించే ఛాన్సుంది. అలా అయినా సరే బడ్జెట్ సమావేశాలను వారంలో ముగించి స్థానిక ఎన్నికల పక్రియపై ప్రభుత్వం దృష్టి సారించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి.

# పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

నెల్లూరు,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఇద్దరు చిన్నారులకు విషమిచ్చి తల్లి కూడా ఆత్మహత్య చేసుకున్న ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. నెల్లూరు జిల్లా కోట మండలం ఊనుగుంటపాలెంలో ఈ విషాదం చోటు చేసుకుంది. ఊనుగుంటపాలేనికి చెందిన రాణి(23) అనే మహిళ తన ఇద్దరు చిన్నారులు ప్రదీప్ (5), సుధీర్ (2)లకు విషమిచ్చి తానూ ఆత్మహత్య చేసుకుంది. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు




తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ వర్ధంతి సందర్భంగా కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళి అర్పించిన నేతలు

# ఎదురెదురుగా రెండు కార్లు ఢీ: ముగ్గురికి గాయాలు

వరంగల్ రూరల్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): ఎదురెదురుగా వచ్చిన రెండు కార్లు ఢీకొనగా.. ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన సంగెం మండలం, గవిచర్ల వద్ద చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని, పరిస్థితిని పరిశీలించారు. అనంతరం, పోలీసులు.. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి అధిక వేగమే కారణమని పోలీసులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రమాదంలో రెండు కార్లు ధ్వంసమయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో మీడియాకు నిషేధం

## -కర్నాటక స్పీకర్ ఆదేశాలు

బెంగళూరు,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): కర్ణాటక ఎమ్మెల్యేల నివాస సముదాయాల్లో మీడియాపై నిషేధం విధించారు. ఈ మేరకు ఆ రాష్ట్ర శాసనసభ స్పీకర్ విశ్వేశ్వరయ్య హెగ్డే నోటీసులు జారీ చేశారు. ఎలక్ట్రానిక్ ప్రింట్ మీడియాతో పాటు కెమెరామెన్లకు ఏ సమయంలో కూడా ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోకి అనుమతించమని స్పీకర్ కార్యాలయం వెల్లడించింది. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఎమ్మెల్యేలు.. తమ తమ నియోజకవర్గాల నుంచి శాసనసభకు వస్తారు. ఈ సమావేశాలకు వచ్చినప్పుడు ఎమ్మెల్యేలకు కేటాయించిన నివాస సముదాయాలకు వెళ్లడం జరుగుతుంది. ఈ సమయం ఎమ్మెల్యేలకు పూర్తిగా ప్రయివేటు సమయం.. కాబట్టి వారి నివాస సముదాయాల్లోకి వెళ్లడం సరికాదని నోటీసుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలతో మాట్లాడేందుకు గృహ సముదాయం గేటు బయట జర్నలిస్టులకు ఏర్పాట్లు చేశామని స్పీకర్ కార్యాలయం తెలిపింది.

# అదుపుతప్పి చెరువులో పడిన కారు.. ముగ్గురు మృతి

యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 22: శుక్రవారం ఈతకోసమని కారులో బయల్దేరిన ముగ్గురు వ్యక్తులు అదుపుతప్పి, కారుతో సహా చెరువులో పడిపోయారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురూ చనిపోయారు. వివరాలు చూసినైట్లైతే.. జిల్లాలోని సర్లేనిగూడెం గ్రామ సర్పంచ్ రాణి భర్త.. మధు, కుమారుడు మత్స్యగిరి, మధు స్నేహితుడు, సాగుబావిగూడెం వాసి శ్రీధర్ రెడ్డి నిన్న ఈతకోసమని కారులో బయల్దేరారు. వారు తిరిగి ఇంటికి రాకపోయేసరికి.. అనుమానంతో రాణి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది చుట్టుపక్కల కుంటల్లో, ఎల్లంకి చెరువులో గాలించగా.. చెరువులో కారు ఆచూకీ లభించింది. వారు కారును క్రేన్ సాయంతో వెలికితీయగా.. కారులో ముగ్గురి మృతదేహాలు లభించాయి. పోలీసులు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కాగా, ప్రమాదంలో భర్త, కుమారుడు చనిపోవడంతో సర్పంచ్ రాణి.. ఆమె కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. ఇద్దరు స్నేహితులు, చిన్నారి మరణించడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.



యాదాద్రి జిల్లా రామన్నపేట మండలం వెల్లంకి చెరువులోకి దూసుకుపోయి మునిగిపోయిన కారును శనివారం వెలికి తీస్తున్న దృశ్యం

# వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితుల గోడు

## త్యాగాన్ని గుర్తించరా అంటున్న ప్రజలు

## తక్షణం పరిహారం కోసం డిమాండ్

ఒంగోలుఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ కింద చెల్లించాల్సిన నష్ట పరిహారం ఎంతనేది నేటికీ నిర్ధారించలేదు. ప్రభుత్వం ఇస్తామంటున్న పరిహారానికి నిర్వాసితులు అంగీకరించడం లేదు. దీంతో సమస్య మొదటికి వచ్చింది. ఇటీవల సిఎం వైఎస్ జగన్ వెలిగొండ సందర్శనకు వచ్చినా నిర్వాసితుల సమస్యలపై నిర్ణయం తీసుకోలేదు. నిర్వాసిత గ్రామాలలో ఇళ్లకు, పొలాలకు నష్టపరిహారం 2012లో చెల్లించారు. అప్పుడు నివాసం ఉన్న కుటుంబాలు, ప్రస్తుతం నివాసముంటున్న కుటుంబాల సంఖ్య పెరిగింది. 18ఏళ్లు దాటి వివాహాలు జరిగి తల్లిదండ్రుల నుంచి విడిపోయిన కుటుంబాల వారు తమకు ప్రత్యేకంగా ప్యాకేజీ అమలు చేయాలని కోరుతున్నారు. వెలిగొండ ప్రాజెక్ట్ నిర్వాసితులకు రూ.6.30లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని అధికారులు ప్రతిపాదనలు పంపారు. అయితే ప్రస్తుతం నిర్వాసితులు రూ.10లక్షలు ఇవ్వాలని కోరుతున్నారు. 2005లో అన్నీ గ్రామాల్లో 5000 కుటుంబాలకి నష్టపరిహారం చెల్లించాలని నిర్ణయించారు. ఈ అంచనాలు జరిగిన ఇప్పటికి 14ఏళ్లు గడిచాయి. నిర్వాసిత కుటుంబాల సంఖ్య పెరిగింది. 18ఏళ్లు దాటి పెళ్లి జరిగి తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారున్నారు. అలా కొత్తగా ఏర్పడ్డ కుటుంబాలు 2వేల వర కూ ఉన్నాయి. అధికారులు తిరిగి సర్వే చేయించి విడిపోయిన వారికి కూడా నష్టపరిహారం అందజేయాలని కోరుతున్నారు. గొట్టిపడియ డ్యాం ముంపు గ్రామాలైన గొట్టిపడియ, అక్కచెరువు తాండ నిర్వాసితులకు మార్కాపురం మండలం వేములకోట సమీపంలో 83ఎకరాల స్థలం కేటాయించారు. రెండు గ్రామాలకు చెందిన 960కుటుంబాలకు అక్కడ ఇళ్లు నిర్మించాల్సి వుంది. కానీ ఎటువంటి పనులు మొదలు కాలేదు. సుంకేసుల డ్యాంపు ముంపుగ్రామమైన కలనూతలకు మార్కాపురం మండలం ఇడుపూరు పరిధిలో రెండు కాలనీలను ఏర్పాటుచేశారు. ఒక్కో కాలనీలో 80కుటుంబాల చొప్పున రెండు కాలనీలలో 160 కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం జరగాల్సి ఉంది. రెండు కాలనీలలో రోడ్లు, గుడి, పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, వైద్యశాల వంటి మౌలిక వసతులు కల్పించారు. కానీ ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. సుంకేసుల డ్యాం ముంపుగ్రామమైన సుంకేసుల, చింతలముడిపి నిర్వాసితులకు పెద్దారవీడు మండలం తోకపల్లి, మార్కాపురం మండలం గోగులదిన్నె సమీపంలో నిర్వాసిత కాలనీలను కేటాయించారు. రెండు కాలనీలలో మౌలిక వసతుల అభివృద్ధి జరిగింది. ఇళ్ల నిర్మాణం ప్రారంభం కాలేదు. గుండంచర్ల నిర్వాసితులకు స్థలసేకరణ సమస్య వెంటాడుతోంది. మార్కాపురం మండలం ఇడుపూరు ఇలాకాలో ప్రభుత్వం స్థలం సేకరించేందుకు నిర్ణయించింది. అయితే నిర్వాసితులలో ఒకవర్గం పెద్దారవీడు మండలం దేవరాజుగట్టు వద్ద స్థలాలు ఇవ్వాలని కోరుతుండగా, మరొకవర్గం ఇడుపూరు వద్ద కావాలని కోరుతుంది. దీంతో నేటికీ స్థల సేకరణ జరగలేదని తెలుస్తోంది.

# ప్రేమను నిరాకరించిందన్న కారణంతో కాల్పులు

గుంటూరు,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): చెరుకుపల్లి మండలం నడింపల్లిలో కాల్పులు కలకలం సృష్టించాయి. రమాదేవి అనే మహిళపై సైనిక ఉద్యోగి బాలాజీ కాల్పులు జరిపాడు. రమాదేవి కుమార్తెను ప్రేమిస్తున్నానంటూ బాలాజీ వెంటపడుతున్నాడు. బాలాజీ ప్రేమను ఆమె కూతురు తిరస్కరించింది. దీంతో బాలాజీ శనివారం ఉదయం రమాదేవి ఇంటికి చేరుకుని నాటు తుపాకీతో కాల్పులు జరిపాడు. తుపాకీని చూసి రమాదేవి అప్రమత్తమై పక్కకు తప్పుకుంది. రమాదేవి కుడి చెవి మీదుగా తూటా దూసుకుపోయింది.

ఈ ఘటనపై బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. బాలాజీ పరారీలో ఉన్నాడు. ఆయనకు సహకరించిన ఆటో డ్రైవర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.



హైదరాబాద్ శివారులోని పీర్జాదిగూడా మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను ప్రారంభించిన మంత్రి మల్లారెడ్డికి కొందరు ఉదారంగా విరాళంగా చెక్కులను అందజేసిన దృశ్యం. చిత్రంలో రాచకొండ కమిషనర్ మహేశ్ భగవత్ తదితరులు ఉన్నారు.

# రంకు మొగుడి కోసం పోలీసుల గాలింపు

## పరారీలో క్యాషియర్ జయకుమార్

చెన్నై,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): పలువురి మహిళలతో వివాహేతర సంబంధాలు పెట్టుకున్న క్యాషియర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు. తమిళనాడు తిరుచ్చి జిల్లా మణప్పారై మస్తాన్ వీధికి చెందిన ఎడ్విన్ జయకుమార్ (36) పుదుకోట్టై విరాలిమలైలోని ఇండియన్ బ్యాంకులో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి పలువురు స్త్రీలతో వివాహేతర సంబంధం ఉందని అతని భార్య పోలీసులను ఆశ్రయించింది. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేయగా బ్యాంకులో ఎడ్విన్ జయకుమార్ నాలుగేళ్ళుగా పని చేస్తున్నాడని, అతను బ్యాంక్‌కు వచ్చే అందమైన మహిళల సెల్‌ఫోన్ నంబర్లను నోట్ చేసుకుని వారితో మాట కలిపి తన బుట్టలో వేసుకుంటాడని, తరువాత వారితో శృంగారాన్ని కొనసాగిస్తాడని తెలిసింది. బ్యాంకులో కాంట్రాక్టు ఉద్యోగిగా చేరిన ఓ మహిళను జయకుమార్ తన వైపు తిప్పుకుని ఆమెతో రాసలీలలు నడిపినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో జయకుమార్‌పై పోలీసులు కేసు నమోదు చేసి పరారీలో ఉన్న అతని కోసం విచారణ చేస్తున్నారు. ఏకంగా 40 మందికి పైగా మహిళలతో భర్త సాగించిన రాసలీలను ఫొటోలు, వీడియోల ఆధారాలతో తాళి కట్టిన భార్యే బట్టబయలు చేసింది. అరెస్ట్ భయంతో భర్త సహా ఐదుగురి కుటుంబసభ్యులు పరారీలో ఉన్నారు. తిరుచ్చిరాపల్లి జిల్లా మనప్పారైకి చెందిన ఎడ్విన్ జయకుమార్ (36) పుదుక్కో÷–టైై జిల్లా వీరాలిమలైలోని ఇండియన్ బ్యాంక్‌లో క్యాషియర్‌గా పని చేస్తున్నాడు. తంజావూరు జిల్లా వల్లం సమీపం రెడ్డిపాళయానికి చెందిన యువతి (32)తో గత ఏడాది డిసెంబర్ 2వ తేదీన వివాహమైంది. పెళ్లయిన రోజు నుంచే జయకుమార్ తన ఇంటిలోని ప్రత్యేక గదిలో గంటల తరబడి పలువురు మహిళలతో అశ్లీలంగా మాట్లాడడం, తనతో సఖ్యతగా ఉండకపోవడాన్ని భార్య గమనించింది. భర్త బ్యాంకుకు వెళ్లిన సమయంలో అతని గదిలోకి వెళ్లి పరిశీలించగా 15 సెల్‌ఫోన్లు, వాటిల్లో జయకుమార్ 40 మందికి పైగా మహిళలతో, బ్యాంకు ఖాతాదారులతో అర్ధనగ్నంగా, నగ్నంగా ఉన్న చిత్రాలు, బాత్‌రూములో వీడియోలు, ఎస్ఎంఎస్‌లు చూసింది. ఈ ఘోరాలను తన అత్తగారు, భర్త సోదరి, అత్తవారింటి ఇతర మహిళా బంధువులకు చెప్పుకుని విలపించింది. అయితే వారేమీ పట్టించుకోలేదు. అయితే తన అంతర్గత విషయాలను కుటుంబసభ్యులకు చెప్పిందని జయకుమార్ ఆగ్రహించి భార్యను తిట్టిపోశాడు. అంతేకాకుండా 'నీవు స్నానం చేస్తున్నపుడు రహస్యంగా వీడియో తీసి జాగ్రత్తగా దాచిపెట్టాం, ఈ విషయాలు ఎవరికైనా చెబితే ఆ దృశ్యాలను సామాజిక మాధ్యమాల్లో పెడతాం' అంటూ జయకువ ార్, అతడి సహోద్యోగిని దేవీ బిలోమినా బెదిరించారు. దీంతో ఆ యువతి ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పగా, వారు జయకుమార్‌ను నిలదీశారు. అయితే తన రాసలీలలను బహిర్గతం చేసిందనే కక్షగట్టిన జయకుమార్...భార్యను హతమార్చేందుకు పథకం రచించాడు. ఆలయాల సందర్శన పేరుతో భార్యను బయటకు తీసుకెళ్లి రెండుసార్లు హత్యాయత్నం చేశాడు. అతడి బారి నుంచి తప్పించుకుని తంజావూరు సర్కిల్ డీఐజీ లోకనాథన్‌కు ఫిర్యాదు చేసింది. డీజీపీ ఆదేశాల మేరకు బాధితురాలి భర్త జయకుమార్, అతని తల్లి విల్లీ హైడా, సోదరి కేథరిన్ నిర్మలామేరీ, బంధువు రీటాతో పాటుగా, జయకుమార్‌తో సంబంధం పెట్టుకుని అతడి దుర్మార్గాలకు సహకరించిన బ్యాంకు ఉద్యోగిని దేవీ బిలోమినాపై మహిళా పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఈ విషయాన్ని పసిగట్టిన జయకుమార్ మదురై హైకోర్టులో ముందస్తు బెయిల్ పొందాడు. దీంతో ముందు జాగ్రత్త చర్యగా తన భర్త రాసలీలలకు సంబంధించిన ఫొటోలు, వీడియో ఆధారాలను మదురై కోర్టుకు అప్పగించి వెంటనే చర్యలు చేపట్టాల్సిందిగా కోరింది. బాధితురాలి పిటిషన్‌ను పరిశీలించిన కోర్టు జామీనుపై విడుదలకు అవకాశం లేని సెక్షన్లతో కేసు నమోదు చేసి నిందితులను వెంటనే అరెస్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. కోర్టు ఆదేశాల మేరకు జయకుమార్ సహా ఐదుగురిపై వల్లం మహిళా పోలీసులు నాలుగు సెక్షన్ల కింద కేసులు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న జయకుమార్... కుటుంబంతో కలిసి పరారీలో ఉన్నాడు. వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# కర్నాటకలోనూ వికేంద్రీకరణ యత్నాలు

## కార్యాలయాలు తరలించే పనిలో సిఎం యెడ్డీ

### కేంద్రం అనుమతి ఉందంటున్న నేతలు

బెంగళూరు,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): కర్నాటక ముఖ్యమంత్రి యడ్యూరప్ప కూడా పాలనా వికేంద్రీకరణలో జగన్ బాటనే అనుసరించాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఏపీలో మూడు రాజధానుల నిర్ణయంపై నిరసనలు భగ్గుమంటున్న వేళ కర్నాటక ప్రభుత్వం కూడా ఇదే బాటలో పయనించాలని నిర్ణయించింది. అయితే రాజధానులను మార్చకుండానే ప్రస్తుతం బెంగళూరులో ఉన్న పలు రాష్ట్ర స్థాయి కార్యాలయాలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్రంలోని బీజేపీ పెద్దల నుంచి అనుమతి కూడా తీసుకున్న సీఎం యడ్యూరప్ప కర్నాటక అసెంబ్లీలో పాలనా వికేంద్రీకరణకు అనుకూలంగా తీర్మానం కూడా ఆమోదింపజేశారు. ఏపీలో మూడు రాజదానుల వ్యవహారం ఓవైపు కాకరేపుతుండగానే పొరుగున ఉన్న కర్నాటక ప్రభుత్వం ఇదే బాటలో పయనిస్తోంది. అయితే జగన్ అనుభవాల నేపథ్యంలో ఒకటికి మించి రాజధానులు కాకుండా బెంగళూరును మాత్రమే రాజధానిగా ఉంచి అక్కడి నుంచి కొన్ని రాష్ట్రస్థాయి కార్యాలయాలను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. దీంతో పాలనాటవికేంద్రీకరణ వ్యవహారం మరోసారి దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారుతోంది. కర్నాటలో స్థానికంగా అందరికీ అభివృద్ధి ఫలాలు అందాలన్న కారణంతో అక్కడి యడ్యూరప్ప ప్రభుత్వం వికేంద్రీకరణకు మొగ్గుచూపుతోంది. ఇప్పటికే కేంద్రంలోని బీజేపీ పెద్దల నుంచి అనుమతి తీసుకున్న సీఎం యడ్యూరప్ప వివిధ రాష్ట్ర స్థాయి కార్యాలయాలను పాలనా వికేంద్రీకరణ పేరుతో తరలించేందుకు కర్ణాటక అసెంబ్లీలో తీర్మానం పెట్టి ఆమోదింపజేశారు. కర్నాటక ప్రభుత్వం తాజా నిర్ణయం ప్రకారం త్వరలో బెంగళూరు నుంచి వివిధ ప్రాంతాలకు రాష్ట్ర స్థాయి కార్యాలయాలు తరలిపోనున్నాయి. వీటిలో నీటిపారుదలశాఖకు చెందిన కృష్ణభాగ్య జల నిగమ్, కర్నాట నీరవరి నిగమ్, పవర్ లూమ్ కార్పోరేషన్, షుగర్ డైరెక్టరేట్, షుగర్ కేన్ డెవలప్ మెంట్ కమిషనర్ కార్యాలయం, కర్నాటక మానవ హక్కుల కమిషన్ కార్యాలయం, ఉప లోకాయుక్త కార్యాలయం ఉన్నాయి. వీటిని బెంగళూరు నుంచి వివిధ ప్రాంతాలకు తరలించనున్నట్లు యడ్యూరప్ప ప్రభుత్వంలోని మంత్రులు చెబుతున్నారు. వీటిని ఎప్పటి కల్లా తరలించాలన్నది ఇంకా నిర్ణయం తీసుకోలేదని తెలుస్తోంది. అసెంబ్లీ తీర్మానం మేరకు త్వరలోనే వీటి తరలింపు ఉంటుందని మాత్రం మంత్రులు చెబుతున్నారు. వాస్తవానికి జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను అనుసరించడం కర్ణాటకలోని యడ్యూరప్ప ప్రభుత్వానికి ఇదే తొలిసారి కాదు. జగన్ ప్రభుత్వం ఏపీలో అధికారం చేపట్టిన వెంటనే తీసుకున్న పరిశ్రమల్లో 75 శాతం స్థానిక కోటా నిర్ణయాన్ని కర్ణాటకలోను అమలు చేయాలని ఇప్పటికే యడ్యూరప్ప సర్కారు నిర్ణయించింది. దీనికి అనుకూలంగా, వ్యతిరేకంగా రాష్ట్రంలో పలు వాదనలు వినిపిస్తూనే ఉన్నాయి. తాజాగా స్థానిక కోటాను అనుకూలంగా కొందరు ఆందోళనకారులు ఏపీ టూరిజం బస్సుపై దాడికి కూడా పాల్పడ్డారు. ఇందులో ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తాజాగా పాలనా వికేంద్రీకరణకు సంబంధించి కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై విపక్షాల నుంచి కూడా పెద్దగా వ్యతిరేకత రావడం లేదు.

ఆహ్వానం

మహిత సాహితి మరియు శ్రీ త్యాగరాయగానసభ సంయుక్త ఆధ్వర్యంలో

ప్రముఖ కవయిత్రి శైలజామిత్ర రచించిన దీర్ఘ కవిత

"సృష్టికేతనం" ఆవిష్కరణ సభ

తేది: 26-02-2020, బుధవారం సా॥ 6 గం॥లకు
వేదిక: త్యాగరాయగానసభ మినీహాలు, హైదరాబాద్

ముఖ్య అతిథి, ఆవిష్కర్త: డా॥ ఎన్.గోపి
(తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి, ప్రఖ్యాత కవి)

సభాధ్యక్షులు: శ్రీ సుధామ (ప్రఖ్యాత కవి, విమర్శకులు)

విశిష్ట అతిథులు: శ్రీ బైస దేవదాసు
(నేటినిజం సంపాదకులు, సీనియర్ పాత్రికేయులు)

శ్రీమతి శీలా సుభద్రాదేవి (ప్రముఖ కవయిత్రి)

ఆత్మీయ అతిథి: శ్రీ కళా జనార్ధనమూర్తి (అధ్యక్షులు, త్యాగరాయగానసభ)

గ్రంథ సమీక్ష: శ్రీమతి స్వాతి శ్రీపాద (ప్రముఖ కవయిత్రి, అనువాదకురాలు)

అభినందనలు : శ్రీమతి తమిరిశ జానకి (ప్రముఖ రచయిత్రి)

సాంస్కృతిక కార్యక్రమం

శిష్టా మాధవి నిర్వహణలో ప్రముఖ కవయిత్రులచే కవి సమ్మేళనం

అరుణ నారదభట్ల, కస్తూరి అలివేణి, ఉమాదేవి కల్వకోట, కుసుమా ఉప్పలపాటి, తమిరిశ జానకి

# రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

## పలువురు ప్రయాణికులకు గాయాలు

రాజమహేంద్రవరం ,ఫిబ్రవరి22 (ఆర్ఎన్ఎ): రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్న సంఘటనలో పలువురికి గాయాలయ్యాయి. అమలాపురం డిపోకు చెందిన రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. రాజమహేంద్రవరం నుంచి అమలాపురం వెళ్లే బస్సు, అమలాపురం నుంచి రాజమహేంద్రవరం వస్తున్న బస్సులు రత్నా ప్లాస్టిక్స్ వద్ద మరో బస్సును ఓవర్ టేక్ చేస్తూ అమలాపురం నుంచి వస్తున్న బస్సును ఎదురుగా ఢీ కొట్టాడు. అమలాపురం బస్సు విద్యుత్ సబ్ స్టేషన్ గేటు గోడకు ఢీ కొట్టాగా, రాజమహేంద్రవరం బస్సు కల్యాణి సోంపాపిడి కోట్టును ఢీ కొట్టి అగిపోయింది. ఈ సంఘటనలో పట్టిసీమ ఆలయానికి వెళ్లి తిరిగి ఇంటికి వెళ్తున్న ఉప్పలగుప్తంకు చెందిన సలాది తాతారావు, ఆయన భార్య సలాది భ్రమరాంబ, వారి కుమార్తెలు మహేశ్వరి, వైష్ణవి తీవ్ర గాయాలు పాలయ్యారు. వీరి కుటుంబం బస్సు ముందు భాగంలో కూర్చొవడంతో తీవ్ర గాయాల పాలయ్యారు. ఆర్టీసీ బస్సు డ్రైవర్లు నరేంద్రపురానికి చెందిన వెలుగుల శంకరరావు, కొత్తపేటకు చెందిన పచ్చమళ్ళ శ్రీనివాసరావు, అమలాపురానికి చెందిన సత్య, అనుషా స్వల్పగాయాలతో బయటపడ్డరు. మరి కొంత మంది గాయాల పాలవ్వగా వారికి ప్రాథమిక చికిత్స అందించారు. టూ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# లౌకికవాద ముసుగులో ఓవైసీ దేశవిద్రోహ చర్యలు

## ఓవైసీ తీరుపై మండిపడ్డ బిజెపి

హైదరాబాద్,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): పార్లమెంట్‌లో లౌకికవాదం అనే ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ బయట మాత్రం మతం పేరిట దిగజారుడు రాజకీయాలు చేస్తున్నారని బీజేపీ ముఖ్య అధికార ప్రతినిధి కె. కృష్ణసాగర్ రావు మండిపడ్డారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఎంఐఎం మత విద్వేషాలు రెచ్చగొట్టే పార్టీ అని మరోసారి రుజువైందన్నారు. ఎన్ఆర్సీ, సీఏఏ, ఎన్ఆర్పీలను ఆధారం చేసుకుని ఎంఐఎం దేశంలో విద్వేషాలు రెచ్చగొడుతుందని విమర్శించారు. అదే విధంగా ఎంఐఎంకు తోడు పార్టీలుగా టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు మారాయన్నారు. భారతదేశం నడి బొడ్డున ఎంఐఎం మీటింగ్‌లో ఒక అమ్మాయి పాకిస్థాన్ జిందాబాద్ అని నినాదాలు చేసిందని, గతంలో ఎంఐఎం సీనియర్ నేత వారీస్ పఠాన్ హిందువులపై అనుచిత వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు. ఈ వ్యాఖ్యలను బీజేపీ తీవ్రంగా ఖండిస్తుందని, సెక్యులర్ అని చెప్పుకునే కాంగ్రెస్, వామపక్షాలు ఇతర పార్టీలు దీనిపై ఎందుకు మాట్లాడటం లేదన్నారు. ఎంఐఎం హిందువులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తుంటే ముఖ్యమంత్రి కేసీఆర్, టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కేటీఆర్ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. హిందువులను ఇన్ని మాటలు అంటుంటే రేవంత్‌రెడ్డి, షబ్బీర్ అలీ, ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు ఎక్కడకు వెళ్లారని ధ్వజమెత్తారు. భారతదేశ ముస్లింలు ఈ రెచ్చగొట్టే వ్యాఖ్యలను.. ఎంఐఎం పార్టీ వ్యాఖ్యాలను ఖండించాలని పిలుపునిచ్చారు. సీఏఏ వ్యతిరేక ఊరేగింపులకు భారదేశ జెండా పట్టుకుని తిరగడం ఒక డ్రామా వాళ్ల అసలు ఎజెండా పాకిస్థాన్ జెండా అంటూ కృష్ణ సాగర్ విమర్శించారు.

# ట్రంప్ మనసు మారాలి

## చిలుకూరులో ప్రత్యేక పూజలు

హైదరాబాద్,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరో మూడు రోజుల్లో భారత్‌లో పర్యటించనున్నారు. అయితే అమెరికా వీసాలు, గ్రీన్‌కార్డులు తదితర అంశాల విషయంలో ట్రంప్ వైఖరిపై ఎప్పటికప్పుడు ఆందోళనలు, నిరసనలు జరుగుతున్న విషయం తెలిసిందే. ట్రంప్ భారత్ పర్యటన నేపథ్యంలో హైదరాబాద్ శివారులోని చిలుకూరు బాలాజీ ఆలయానికి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు క్యూ కడుతున్నారు. విదేశాలకు వెళ్లదలచుకున్న భక్తులు ఇండియాలో ట్రంప్ పర్యటన సందర్భంగా ఇక్కడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. హెచ్1బీ వీసాల సంఖ్యను కుదించాలన్న ట్రంప్ ఆలోచనా ధోరణిని, భారతీయుల పట్ల ట్రంప్ అభిప్రాయాన్ని మార్చాలని వేడుకున్నారు. చిలుకూరు బాలాజీకి వీసా బాలాజీగా పేరున్న విషయం తెలిసిందే. విదేశాల్లో ఉద్యోగాల కోసం వెళ్ళే యత్నాల్లో ఉన్నవారు... చిలుకూరు బాలాజీ దేవాలయంలో పదకొండు సార్లు ప్రదక్షిణలు చేసి, స్వామి వారిని దర్శించుకుంటే వీసాలు వస్తాయనన్న విశ్వాసం ప్రజల్లో ఉంది.

# పిసిసి చీఫ్ రేసులో ఉన్నా: కోమటిరెడ్డి

నల్గొండ,ఫిబ్రవరి22(ఆర్ఎన్ఎ): త్వరలో పీసీసీ అధ్యక్షుడి మార్పు ఉండొచ్చని భువనగిరి కాంగ్రెస్ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. పీసీసీ చీఫ్ రేసులో తాను ఉన్నట్లు తెలిపారు. అలాగే త్వరలో సోనియాగాంధీని కలవనున్నట్లు చెప్పారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవడమే తన లక్ష్యమని ప్రకటించారు. కేసీఆర్‌కు రాష్ట్రాభివృద్ధి కంటే కమీషన్లపైనే మక్కువ ఎక్కువ అని విమర్శించారు. ఐదేళ్లుగా నిధులివ్వకుండా ప్లలె, పట్టణ ప్రగతి అంటూ హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఐదేళ్లలో పేదలకు ఒక్క ఇల్లు కూడా ఇవ్వలేదని ఆరోపించారు. త్వరలో నకిరేకల్–నాగార్జునసాగర్ హైవే టెండర్లు పిలుస్తామని ఏబీఎన్‌తో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు.

# కరోనాను జయించిన నాలుగు నెలల శిశువు

బీజింగ్,ఫిబ్రవరి 22 (ఆర్ఎన్ఎ):చైనాలో మరణమృదంగం మోగిస్తున్న కరోనా వైరస్ ధాటికి 26దేశాలు వణికిపోతున్నాయి. ప్రపంచాన్నే భయాందోళనకు గురిచేస్తోన్న కరోనాను ఓ నాలుగు నెలల చిన్నారి జయించింది. చైనాకు చెందిన 4 నెలల శిశువుకి ఇటీవల కరోనా వైరస్ లక్షణాలు కనిపించాయి. దీంతో.. చిన్నారిని తల్లిదండ్రులు ఆస్పత్రిలో చేర్పించారు.

డాక్టర్లు ప్రత్యేక పర్యవేక్షణలో ఆ చిన్నారికి చికిత్స అందించారు. తాజాగా నిర్వహించిన పరీక్షల్లో కరోనా లక్షణాలు కనిపించకపోవడంతో శిశువును కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా 18,254 మంది ఈ వైరస్ బారి నుంచి కోలుకున్నారు. చైనాలోని వూహాన్ నగరంలో పుట్టిన ఈ వైరస్.. యావత్ ప్రపంచాన్ని గడగడలాడిస్తోంది. ప్రజల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. మనుషులు పిట్టల్లా రాలిపోతున్నారు. వందల సంఖ్యలో మృత్యువాత పడ్డారు. వేల సంఖ్యలో కేసులు నమోదవుతున్నాయి. వైరస్ సోకిన కొన్ని రోజుల్లోనే మనిషి చనిపోతున్నాడు. అనేక దేశాలకు ఈ మహమ్మారి వ్యాపించింది. ఎన్నో దేశాలకు నిద్ర లేకుండా చేస్తున్న కరోనా వైరస్‌కు ప్రపంచ ఆరోగ్య సంస్థ కొత్త పేరు పెట్టింది. ఇకపై కరోనాను అధికారికంగా 'కోవిడ్–19' అని పిలవనున్నారు. ఇందులో సీ అక్షరం కరోనాను, వీ అక్షరం వైరస్‌ను, డీ అక్షరం డిసీజ్ ను, 19ని.. వ్యాధిని కనుగొన్న 2019కి సూచనగా పెట్టారు.

# రెండోరోజూ టీమిండియా విఫలం



## 43 పరుగులకే ఐదు వికెట్లు ధమాల్

### ఐదు వికెట్లు కోల్పోయి 216 పరుగులు చేసిన కివీస్

వెల్లింగ్టన్,ఫిబ్రవరి 22(ఆర్ఎన్ఎ): భారత్‌తో బేసిన్ రిజర్వ్ మైదానంలో జరుగుతున్న తొలి టెస్టులో ఆతిథ్య కివీస్.. రెండో రోజు ముగిసే సమయానికి 51 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. అంతకుముందు రెండోరోజు ఆటను ప్రారంభించిన టీమిండియా కేవలం 43 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయ్యింది. వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో భారత్ 165 పరుగులకే ఆలౌటైంది. తొలి రోజు 122 పరుగులకు అయిదు వికెట్లు కోల్పోయిన భారత్.. రెండవ రోజు మరీ పేలవంగా ఆడింది. కేవలం 43 పరుగులు మాత్రమే జోడించి మరో అయిదు వికెట్లను చేజార్చుకుంది.

భారత ఇన్నింగ్స్‌లో రహానే అత్యధికంగా 49 పరుగులు చేశాడు. చివర్లో షమీ 21 రన్స్ చేయడంతో ఆ మాత్రం గౌరవం దక్కింది.

మ్యాచ్ ఆరంభంలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్ తొలి రోజు.. కివీస్ బౌలర్ల ధాటికి 5 వికెట్లు కోల్పోయి, 122 పరుగులు చేసింది. అనంతరం రెండోరోజు ఆట ప్రారంభించిన టీమిండియా.. తొలి రోజు స్కోరుకు మరో 43 పరుగులు మాత్రమే జోడించి చివరి 5 వికెట్లు కోల్పోయింది. భారత్ బ్యాట్స్‌మెన్‌లో వైస్ కెప్టెన్ రహానే 46 పరుగుల అత్యధిక పరుగులు సాధించిన ఆటగాడిగా నిలిచాడు. రెండో టాప్ స్కోరర్ మయాంక్ అగర్వాల్ 34 పరుగులు సాధించాడు. మిగితా బ్యాట్స్‌మెన్ అంతా విఫలమయ్యారు.

కివీస్ బౌలర్లలో టిమ్ సౌథీ, జెమిసన్ నాలుగేసి వికెట్లు పడగొట్టగా, బౌల్ట్ 1 వికెట్ తీశాడు. ఇకపోతే న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్(89) అద్భుతమైన అర్ధసెంచరీతో రాణించాడు. అతడికి సీనియర్ బ్యాట్స్‌మెన్ రాస్‌టేలర్(44) చక్కటి సహకారాన్ని అందించాడు. తొలివికెట్‌ను త్వరగానే చేజిక్కించుకున్న ఇండియా.. మరో వికెట్ తీయడానికి 20 ఓవర్లు తీసుకుంది. సీనియర్ ఫాస్ట్ బౌలర్ ఇషాంత్ శర్మ(3/31) అద్భుత బంతులతో ఓపెనర్లిద్దరినీ పెవిలియన్ చేర్చాడు. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన కెప్టెన్ కేన్.. రాస్‌టేలర్ సమయోచిత బ్యాటింగ్‌తో స్కోరుబోర్డును పరుగులు పెట్టించారు. ముఖ్యంగా విలియమ్సన్.. భారత బౌలర్లపై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించాడు. వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదాడు. సెంచరీ వైపు దూసుకెళ్తున్న కివీస్ కెప్టెన్‌ను షమీ ఔట్ చేశాడు. షాట్ ఆడబోయిన కేన్.. రవీంద్ర జడేజాకు క్యాచ్ ఇచ్చాడు. మరో పది ఓవర్ల వ్యవధిలో రాస్ టేలర్‌ను.. ఇషాంత్ పెవిలియన్ పంపించాడు. క్రీజులో కుదురుకుంటున్న హెన్రీ నికోల్స్‌ను అశ్విన్ బొల్తా కొట్టించాడు. అశ్విన్ వేసిన బంతిని డిఫెన్స్ ఆడబోయిన నికోల్స్.. బంతి హెడ్జ్ తీసుకొని సెకండ్ స్లిప్స్‌లో విరాట్ అద్భుత క్యాచ్‌కు వెనుదిరిగాడు. ప్రస్తుతం క్రీజులో వాట్లింగ్(14 నాటౌట్), గ్రాండ్‌హోమ్(4) ఉన్నారు. ఆట మరో మూడు రోజులు మిగిలి ఉండగా.. కివీస్ రెండో రోజు ముగిసే సమయానికి 71.1 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 216 పరుగులు చేసింది.

# వసతి గృహాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు..



వరంగల్ రూరల్, ఫిబ్రవరి 22: సంగెం మండల కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలను కలెక్టర్ హరిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలాంటి సమాచారం లేకుండా హాస్టళ్లకు వెళ్లిన కలెక్టర్.. అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. వంటలెలా వండుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. హాస్టల్‌లో నాణ్యమైన భోజనం అందిస్తున్నారా.. అని విద్యార్థులను ఆరా తీశారు. వసతి గృహాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అక్కడి సిబ్బందికి సూచించారు. విద్యార్థులు కూడా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ తెలిపారు. వార్డెన్‌లను, సిబ్బందిని పిలుపించుకున్న కలెక్టర్.. విద్యార్థుల పట్ల ప్రేమగా మెలగాలనీ.. వారికి, తగిన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలిగించినా, కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. విద్యార్థులు కూడా అన్ని వసతులు పొందాలనీ.. అది మీ హక్కు అని వారికి తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వినియోగించుకొని, చదువులో ఉత్తమంగా రాణించాలని కలెక్టర్ హరిత.. విద్యార్థులకు హితబోధ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కూడా ఉన్నారు.

# కెసిఆర్ నాయకత్వంలో అభివృద్ధి జరగాలి: ఎంపి సంతోష్

మేడ్చెల్,ఫిబ్రవరి21(ఆర్ఎన్ఎ):: సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి నిర్విరామంగా కొనసాగాలని రామలింగేశ్వరస్వామిని కోరినట్లు ఎంపీ సంతోష్ కుమార్ తెలిపారు. తెలంగాణ ప్రజలు సుఖశాంతులతో సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు చెప్పారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని కీసరగుట్టలోని శ్రీ రామలింగేశ్వర ఆలయంలో మంత్రి మల్లారెడ్డి, ఎంపీ సంతోష్ కుమార్, ఎమ్మెల్సీలు నవీన్ రావు, శంబీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మాల్లారెడ్డి మాట్లాడుతూ.. కీసరగుట్ట తన నియోజకవర్గంలో ఉండటం తన పూర్వజన్మ సుకృతమన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రజలు పాడిపంటలతో, సుఖశాంతులతో ఉండాలని స్వామిని ప్రార్థించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ... సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల నాయకత్వంలో రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నట్లు వెల్లడించారు.సీఎం కేసిఆర్ నేతృత్వంలో తెలంగాణ ప్రజలు పాడిపంటలతో, సుఖశాంతులతో ఉండాలని ఆ రామలింగేశ్వరస్వామి ని ప్రార్థించాను' అని తెలిపారు.

# స్కూలు బాట పట్టేలా చేసిన టీచర్లు

## -వినూత్నంగా చేసిన ఆలోచన ఫలించింది

పెద్దపల్లి,ఫిబ్రవరి 21(ఆర్ఎన్ఎ): దేవునిపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు మళ్లీ కళ తీసుకుని వచ్చారు. పిల్లలు స్కూలుకు వచ్చేలా టీచర్లు కృషి చేశారు. ఇక్కడ ఐదో తరగతి వరకు విద్యాబోధన చేస్తున్నారు. మొదట్లో ఈ పాఠశాలలో 10 మంది విద్యార్థులు మాత్రమే ఉండేవారు. గ్రామంలో తల్లిదండ్రులంతా తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలలకు పంపించేవారు. దీంతో బడి మూసివేసే దశకు చేరింది. ఉపాధ్యాయురాలు పిల్లల తల్లిదండ్రులను ప్రశ్నిస్తే ఇక్కడ ఏముంది? పిల్లలను పంపడానికి అని ప్రశ్నించారు. పిల్లలను ఎలాగైనా ప్రభుత్వ పాఠశాలకు రప్పించాలని టీచర్లు చాలెంజ్‌గా తీసుకున్నారు. ఒక వినూత్నమైన ఆలోచన చేశారు. తమ సొంత ఖర్చులతో బడి గోడలపై బస్సు బొమ్మ వేయించారు. అచ్చులు, హల్లులు, ఇంగ్లీషుకు సంబంధించిన గ్రామర్‌ను గోడలపై రంగులతో వేయించారు. వాటిని విద్యార్థులు రోజూ చూడడంతో గుర్తుంటాయని గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రచారం చేశారు. పాఠశాలకు వచ్చి చూసిన తర్వాతే విద్యార్థులను పంపాలని తల్లిదండ్రులను కోరారు. దీంతో పాఠశాలకు వచ్చి చూసిన తల్లిదండ్రులకు ప్రైవేటు పాఠశాల తీరుగా కనిపించింది. అంతే కాకుండా పిల్లలు బడిలోకి వెళ్లేటప్పుడు బస్సులోకి వెళుతున్నామనే భావన కలిగేలా ప్రత్యేకంగా బస్సు బొమ్మ వేయించారు. విద్యార్థులు కూడా ఇక్కడే చదువుతాము అనడంతో తల్లిదండ్రులు ఆ పాఠశాలకే పంపిస్తున్నారు.

Printed, Published and owned by VEENADAS,at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74,Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas, Ph.No.040- 2766 2477.
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com.